

పలువురు సీఐల బదిలీ



మహారాణిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వన్‌టౌన్ సీఐ జి.దేముడుబాబును ఎయిర్‌పోర్టు ప్రొటోకాల్ అధికారిగా బదిలీ చేసి, ఆయన స్థానంలో పూడి వరప్రసాద్‌ను నియమించారు. సిటీ వీఆర్‌లో ఉన్న ఎస్.రామకృష్ణను ఎయిర్‌పోర్టు ఇమ్మిగ్రేషన్ అధికారిగా నియమించి, అక్కడున్న ... మిగతా 6వ పేజీలో

రయ్.. రయ్

పగ్గాల్లేని ట్రావెల్స్ బస్సులు

పరిమితికి మించిన వేగంతో ప్రయాణం

- ఈ నెల 15న రాజస్థాన్‌లో ఒక బస్సు దహనం
- అప్పుడే అప్రమత్తమైన రవాణా, పోలీసు శాఖలు
- 58 కేసులు...4 బస్సుల సీజ్...రూ.9.5 లక్షల జరిమానా
- కర్నూలు ఉదంతంతో సర్వత్రా ఆందోళన
- విశాఖ నుంచి విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలకు నిత్యం వేలాది మంది రాకపోకలు



విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):

కర్నూలు జిల్లాలో జరిగిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదం అందరిలోను ఆందోళన రేకెత్తించింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు శుక్రవారం తెల్లవారుజామున కర్నూలు సమీపంలో బైక్‌ను ఢీకొట్టి మంటల్లో దహనమైంది. ఈ ప్రమాదంలో 19 మంది సజీవ దహనమయ్యారు. మరో 21 మంది గాయాలతో బయటపడ్డారు. బాధితుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, వారి కుటుంబ సభ్యులు ఎక్కువగా ఉన్నారు. ఈ ఘటన నగరవాసులను దిగ్భ్రాంతి కలిగించింది.

ఉత్తరాంధ్ర జిల్లాల వాసులు వేలాది మంది హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలలో ఉద్యోగాలు చేస్తున్నారు. వారాంతపు రోజుల్లో, పండుగ సమయాల్లో వారు ఇక్కడకు రావడం, కుటుంబ సభ్యులు ఇక్కడి నుంచి అటు వెళ్లడం పరిపాటిగా మారింది. బెంగళూరు, హైదరాబాద్‌లకు తక్కువ సమయంలో రైలు రిజర్వేషన్ సదుపాయం లభించకపోవడం వల్ల అత్యధికులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ సాయంత్రం బయలుదేరితే మరుసటిరోజు ఉదయం అక్కడకు వెళ్లిపోతున్నారు. అందుకని వాటిపై మొగ్గు చూపుతున్నారు. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని నేషనల్ పర్మిట్ కలిగిన బస్సులను రోజుకు 50 నుంచి 60 వరకూ విశాఖపట్నం మీదుగా నడుపుతున్నారు. అదే పండుగలు, టూరిస్ట్ సీజన్లు అయితే 75 వరకు ఉంటున్నాయి. అయితే ఇవన్నీ ఇతర రాష్ట్రాలలో రిజిస్టర్ అయినవి. ఏపీలో ఇలాంటి బస్సులను రిజిస్టర్ చేసుకోవాలంటే ట్యాక్స్ ఎక్కువ చెల్లించాలి.



పర్మిట్ గడువు ముగిసిన బస్సును సీజ్ చేసిన అధికారులు

అదే ఇతర రాష్ట్రాల్లో తక్కువ కడితే సరిపోతుంది. దాంతో ఒడిశా వంటి రాష్ట్రాల్లో రిజిస్టర్ చేసుకుంటున్నారు. విజయవాడ, తిరుపతి వంటి ప్రాంతాలకు వెళ్లేవి మాత్రం ఇక్కడే రిజిస్టర్ అవుతున్నాయి. దూరప్రాంతాలకు నడిపే బస్సులను మంచి కండిషన్‌లోనే ఉంచుతారు. అయితే నగరాల్లో ట్రాఫిక్ వల్ల ఈ బస్సులు అనుకున్న సమయానికి చేరవు. అందుకని హైవే ఎక్కగానే డ్రైవర్లు పరిమితికి మించిన వేగంతో దూసుకుపోతుంటారు. ప్రయాణికులు అంతా నిద్రలో ఉండడం వల్ల ఈ విషయం గమనించరు. ఈ క్రమంలో డ్రైవర్ ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. ఈ బస్సుల్లో ఇద్దరు డ్రైవర్లు ఉంటారు. అయినా ఒక్కోసారి నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు తప్పడం లేదు.

అధికారులు అప్రమత్తం

కర్నూలు జిల్లాలో శుక్రవారం ఉదయం బస్సు ప్రమాదానికి ముందు ఈ నెల 15వ తేదీన రాజస్థాన్‌లోని జైసల్మీర్‌లో ఏసీ స్లీపర్ క్లాస్ బస్సు మంటలు అంటుకొని కాలిపోయింది. ఆ ఘటనలో పలువురు మరణించారు. అప్పుడే రవాణా శాఖ అధికారులకు పైనుంచి ఆదేశాలు వచ్చాయి. నేషనల్ పర్మిట్ తీసుకొని టూరిస్ట్ బస్సులుగా నడుస్తున్న వాటిపై దృష్టి పెట్టారు. బెంగళూరు నుంచి వచ్చే బస్సులు అనకాపల్లి, ఆనందపురం నుంచి శ్రీకాకుళం, ఒడిశా వెళుతున్నాయి. రాయగడ, జైపూర్, బరంపురాల నుంచి వచ్చే బస్సులు విశాఖ నగరం మీదుగా ... మిగతా 6వ పేజీలో

రెస్టారెంట్లలో నిల్వ పదార్థాలు

- అధికారుల తనిఖీల్లో బహిర్గతం
- జరిమానాలు, శాంపిళ్ల సేకరణ



దీపక్ పంజాబీ దాబాలో నిల్వ పదార్థాలను పరిశీలిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆహార భద్రతాధికారులు తనిఖీలు నిర్వహించి, భారీగా జరిమానాలు వేస్తున్నా రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వాహకుల్లో మార్పు రావడం లేదు. రోజుల తరబడి ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను వేడి చేసి వడ్డిస్తున్నారు. అవి తిన్నవారు ఆస్పత్రుల పాలవుతున్నారు. శుక్రవారం ఆహార భద్రతాధికారులు, జీవీఎంసీ పారిశుధ్య అధికారులు కలిసి నగరంలో పలు రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించి, జరిమానాలు విధించారు. రామ్‌నగర్‌లోని బ్రైన్ ధీమ్ రెస్టారెంట్‌ను తనిఖీ చేసినపుడు వంటగది పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. అందుకుగాను రూ.10 వేలు జరిమానా వేశారు. అలాగే అక్కడి ఫ్రీజర్లలో 26 కిలోల పాడైన ఆహార పదార్థాలను గుర్తించారు. పంచనామా చేసి వాటిని సీజ్ చేశారు. నాలుగు ప్యాకెట్లలో పాడైన పాలను గుర్తించి, వాటిని పారబోశారు. రెస్టారెంట్ భాగస్వామి ధనలక్ష్మిపై కేసు నమోదు చేసి నోటీసు ఇచ్చారు. అదేవిధంగా ఎన్ఏడీ జంక్షన్‌లోని దీపక్ పంజాబీ దాబాలో 46 కిలోల ఆహార పదార్థాలు పాడైపోయినవి నిల్వ చేసినట్టు గుర్తించి కేసు నమోదు చేశారు. రూ.10,605 జరిమానా వేశారు. ఎన్ఏడీ జంక్షన్‌లోని ప్యారడైజ్ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించగా నిల్వ చేసిన ఆహార పదార్థాలు ఏమీ దొరకలేదు. వంట గది పరిసరాలు కూడా పరిశుభ్రంగానే ఉండడంతో ఎటువంటి కేసులు నమోదు చేయలేదని అధికారులు తెలిపారు.

స్టాండింగ్ కమిటీలో కమీషన్ లొల్లి

- కాంట్రాక్టర్ల నుంచి పది శాతం వసూలు?
- వాటాల పంపిణీలో విభేదాలు
- ప్రైవేటు వ్యక్తి జోక్యం
- సభ్యుల ఆగ్రహం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కాంట్రాక్టర్ల నుంచి వసూలుచేసిన కమీషన్‌ల పంపిణీ విషయమై స్టాండింగ్ కమిటీలో అంతర్గత పోరు నడుస్తున్నట్టు జీవీఎంసీ చర్చ జరుగుతోంది. స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించిన కొన్ని అంశాలకు సంబంధించి కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ కింద కొంత మొత్తం వసూలు చేశారని, దానిని వాటాలు వేసుకునే క్రమంలో సభ్యుల మధ్య భేదాభిప్రాయాలు తలెత్తినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో తమపై ఓ ప్రైవేటు వ్యక్తి పెత్తనం చేయడంపై సభ్యులు ఆగ్రహంతో ఉన్నట్టు తెలిసింది.

జీవీఎంసీలో స్టాండింగ్ కమిటీది అత్యంత కీలక పాత్ర. రూ.50 లక్షలలోపు విలువైన అభివృద్ధి పనులతోపాటు బిల్లుల చెల్లింపునకు ఆమోదం, కొన్ని పరిపాలనా, ఉద్యోగుల సర్వీస్ పరమైన అంశాలన్నీ స్టాండింగ్ కమిటీ పరిధిలో ఉంటాయి. కమిటీలో సభ్యులుగా పది మంది కార్పొరేటర్లు ఉంటే, చైర్మన్‌గా మేయర్ వ్యవహరిస్తారు. వైసీపీ హయాంలో స్టాండింగ్ కమిటీ సమావేశం అంటే కమీషన్ల జాతర అనే అభిప్రాయం అధికారులు, కార్పొరేటర్లతోపాటు కాంట్రాక్టర్లలో ఉండేది. ఈ కౌన్సిల్ ఏర్పడిన తర్వాత మొదటి స్టాండింగ్ కమిటీ బిల్లుల చెల్లింపు కోసం కాంట్రాక్టర్ల నుంచి రెండు శాతం కమీషన్ వసూలుచేస్తే, రెండో ఏడాది ఎన్నికైన స్టాండింగ్ కమిటీ నాలుగు శాతం, మూడో ఏడాది ఎన్నికైన స్టాండింగ్ కమిటీ ఎనిమిది శాతం చొప్పున వసూలుచేశాయనే ఆరోపణలు ఉన్నాయి. ఆ మొత్తాన్ని సభ్యులు పంచుకునేవారు. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినాసరే పట్టించుకునేవారు కాదు. తర్వాత రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో గత ఏడాది జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ సభ్యులే పది స్థానాలను దక్కించుకున్నారు. ఆ కమిటీపై పెద్దగా ఆరోపణలు రాలేదు. మూడు నెలలు కిందట ఎన్నికైన తాజా స్టాండింగ్ కమిటీపై మాత్రం ఆరోపణలు వెల్లువెత్తుతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జీవీఎంసీలో ఒక కీలక నేతతో తిరుగుతున్న ప్రైవేటు వ్యక్తి స్టాండింగ్ కమిటీ పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్టు చెబుతున్నారు. స్టాండింగ్ కమిటీ అజెండాలో ఏ అంశాలు పెట్టాలో ఆయనే అధికారులకు చెబుతున్నారని, తాము ఆమోదించిన అంశాల్లో బిల్లుల చెల్లింపునకు సంబంధించినవి వుంటే సంబంధిత అధికారుల ద్వారా ఆ పనులుచేసి కాంట్రాక్టర్లను పిలిచి పది శాతం కమీషన్ ఇవ్వాలని ముక్కుపిండి వసూలుచేస్తున్నారని కొందరు సభ్యులే చెబుతున్నారు. అలా వసూలుచేసిన మొత్తంలో నాలుగు శాతం కీలక నేతకు ఇవ్వాలని మినహాయించి, మిగిలిన మొత్తంలో సభ్యులతోపాటు సదరు ప్రైవేటు వ్యక్తి కూడా సమాన వాటా తీసుకుంటున్నారంటున్నారు. తమ పేరుతో వసూలుచేసే కమీషన్‌ను తమకు పూర్తిగా ఇవ్వడం లేదని, ఏదో తన జేబులో డబ్బులు ఇస్తున్నట్టు తోచినంత మొత్తాన్ని ... మిగతా 6వ పేజీలో

Google రాకతో రియల్టర్ల హడావిడి



తర్లువాడ భూములు

- ఆనందపురంతో పాటు భీమిలి మండలంలో భూముల కోసం వేట
- ఇదే పనిలో కీలక నేతల బంధువులు

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): **ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకానున్న నేపథ్యంలో ఆ చుట్టుపక్కల భూముల కోసం రియల్టర్లు తెగ తిరుగుతున్నారు. రైతులతో మాట్లాడుతున్నారు. ఆనందపురం మండలంలో గూగుల్ డేటా సెంటర్‌తో పాటు మరికొన్ని సంస్థలు వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. దీంతో భూములకు డిమాండ్ పెరుగుతోంది.**

అయితే ఆనందపురం, భీమిలి, పెందుర్తి, పద్మనాభం మండలాల్లో సుమారు 3,500 ఎకరాల (డి.పట్టా భూములు)ను ఇళ్ల నిర్మాణం నిమిత్తం గత ప్రభుత్వం సమీకరించింది. అలాగే వీఎంఆర్‌డీఏ ఎంఐజీ లేఅవుట్‌ల కోసం ఆనందపురం మండలంలో సుమారు ... మిగతా 6వ పేజీలో

పీఎంఏవై 2.0లో 3,400 ఇళ్లు

సొంత స్థలం ఉన్నవారికి మాత్రమే మంజూరు

- యూనిట్ వ్యయం రూ.2.5 లక్షలు
- ఎన్టీఆర్ కాలనీల్లో పూర్తయిన 25 వేల ఇళ్లు
- త్వరలో లబ్ధిదారులకు అప్పగింత
- మిగిలిన నిర్మాణాలు వచ్చే ఏడాది మార్చికల్లా పూర్తి
- రూ.631 కోట్లతో తాగునీటి వసతి
- 'ఆంధ్రజ్యోతి'తో గృహ నిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ సత్తిబాబు



విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2.0లో భాగంగా జిల్లాకు 3,400 ఇళ్లు మంజూరయ్యాయని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ సత్తిబాబు తెలిపారు. పీఎంఏవై 2.0 కింద ఒక ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులకు రూ.2.5 లక్షలు ఇస్తారన్నారు. ఆయన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ పీఎంఏవై 2.0 కింద సొంత స్థలాలున్న వారికే ఇళ్లు కేటాయిస్తామన్నారు. పీజీఆర్ఎస్‌తోపాటు సచివాలయాలకు అందిన దరఖాస్తులను పరిశీలించి సొంత స్థలం ఉండి, ఇళ్లు లేని వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నామన్నారు. వారందరికీ సంబంధిత ఎమ్మెల్యేల సమక్షంలో అలాట్‌మెంట్ లేఖలు అందజేస్తామని వివరించారు. లబ్ధిదారులే స్వయంగా ఇళ్లు నిర్మించుకోవల్సి ఉంటుందని, దశల వారీగా బిల్లులు ఇస్తామని సత్తిబాబు తెలిపారు.

నగర శివారుల్లో మొత్తం 65 లేఅవుట్‌లలో సెంటు స్థలాల్లో నిర్మిస్తున్న ఇళ్లలో సుమారు 25 వేల ఇళ్లు త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. శ్రావణమాసంలో ఇళ్లు అప్పగించాలని భావించినా వర్షాలు కొనసాగడంతో తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. ఇంకా మిగిలిన 75 వేల ఇళ్లు వచ్చే ఏడాది మార్చికల్లా పూర్తిచేస్తామన్నారు. ఇందుకుగాను కాంట్రాక్టర్లకు లక్ష్యాలు నిర్దేశించామని పేర్కొంటూ వర్షాలు తగ్గిన వెంటనే పనులు వేగవంతం చేయాలని ఆదేశించామన్నారు. ప్రతి ఇంటికీ తలుపులు బిగించిన తరువాతే లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. ఇప్పటికే కొందరు కాంట్రాక్టర్లు ఇళ్లకు తలుపులు బిగించారని, మిగిలిన కాంట్రాక్టర్లు ఈ విధానాన్ని కొనసాగించాల్సిందేనని స్పష్టంచేశారు.

కాలనీల్లో నివాసం ఉండే లబ్ధిదారులకు తాగునీటి కల్పన కోసం రూ.631 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపామని పీడీ సత్తిబాబు తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ... మిగతా 6వ పేజీలో

జేఎన్‌ఆర్‌కు హౌసింగ్ చెక్

- కంపెనీకి బిల్లుల చెల్లింపు నిలిపివేత
- వైసీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఇళ్ల నిర్మాణ బాధ్యతలు దక్కించుకున్న సంస్థ
- అవకతవకలకు పాల్పడినట్టు ఇటీవల నెల్లూరు జిల్లా ఎమ్మెల్యే ఫిర్యాదు
- నిర్మాణ నాణ్యత పరిశీలించాలని జిల్లాలకు ఉన్నతాధికారుల ఆదేశం
- మిగిలిన కంపెనీల బిల్లులు అప్‌లోడ్

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):



నగర శివారు ప్రాంతాల్లోని పలు లేఅవుట్‌లలో జేఎన్‌ఆర్ కంపెనీ చేపట్టిన ఇళ్ల నిర్మాణాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని గృహ నిర్మాణ సంస్థ నిర్ణయించింది. ఆ కంపెనీ నెల్లూరు జిల్లాలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో అవకతవకలకు పాల్పడిందని టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపణలు చేయడంతో విచారణ చేపట్టాలని, అప్పటి వరకూ బిల్లులు నిలిపివేయాలని అన్ని జిల్లాల అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలు పంపారు. దీంతో మిగిలిన నిర్మాణ సంస్థల బిల్లులు కూడా రెండు నెలలుగా ఆపేశారు. అయితే ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలంటే బిల్లులు ఇవ్వాలని ఆయా సంస్థలు కోరడంతో హౌసింగ్ ఉన్నతాధికారులు ఒక యాప్ రూపొందించారు. క్షేత్రస్థాయిలో ఇళ్ల తాజా ఫొటో తీసి ఆ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. జేఎన్‌ఆర్ కంపెనీ కాకుండా ఇతర నిర్మాణ సంస్థలు ... మిగతా 6వ పేజీలో

రైస్ స్మార్ట్ కార్డులు 88.71% పంపిణీ

- మొత్తం కార్డులు 5,17,155, ఇప్పటివరకూ పంపిణీ అయినవి 4,58,759
- అత్యధికంగా పద్మనాభం మండలంలో 97.32 శాతం

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ జిల్లాలో 88.71 శాతం మేర జరిగింది. రెండు నెలల నుంచి సచివాలయాలు, రేషన్ డిపోల్లో స్మార్ట్ రైస్ కార్డులు అందుబాటులో ఉంచారు. కార్డుదారులు తమ తమ ప్రాంతాల్లో సచివాలయాలు, రేషన్‌డిపోలకు వెళ్లి కార్డులు తీసుకున్నారు. ఇతర ప్రాంతాలకు వలసవెళ్లినవారు, నగరంలో కొందరు మాత్రం ఇంకా కార్డులు తీసుకోలేదు. జిల్లాలోని 642 రేషన్ డిపోల్లో 5,17,155 మంది కార్డుదారులు ఉన్నారు. ఇప్పటివరకు గ్రామ/వార్డు సచివాలయాల్లో 2,08,322, రేషన్ డిపోల్లో 2,50,437 మంది...మొత్తం 4,58,759 (88.71 శాతం)మంది కార్డులు తీసుకున్నారు. ఇంకా 58,396 మంది తీసుకోవలసి ఉంది. పద్మనాభం మండలంలో 16,569 మందికిగాను 16,125 (97.32 శాతం), పెందుర్తి మండలంలో 10,455 మందికిగాను 9,873(94.43 శాతం), ఆనందపురం మండలంలో 20,254మందికి 19,005 (93.83), భీమునిపట్నం మండలంలో 34,521 మందికి 31,250 (90.52 శాతం) మంది కార్డులు తీసుకున్నారు. ఇక నగర పరిధిలో సర్కిల్-1లో 1,54,074కి 1,34,267 (87.14 శాతం), సర్కిల్-2లో 1,50,377కి 129,594 (86.18 శాతం), సర్కిల్-3లో 1,30,905కి 1,18,645 (90.63 శాతం) మందికి పంపిణీ చేశారు. ఈ నెలాఖరు వరకు రేషన్ డిపోల్లో స్మార్ట్ రైస్‌కార్డులు అందుబాటులో ఉంటాయని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి వి.భాస్కర్ తెలిపారు. ఆ తరువాత సహాయ పౌరసరఫరాల శాఖ కార్యాలయాల్లో ఉంచుతామని, కార్డుదారులు అక్కడకు వెళ్లి తీసుకోవచ్చునని అన్నారు.

కిడ్నీ రోగులకు ఊరట

కేజీహెచ్‌కు చేరిన పది డయాలసిస్ మెషీన్లు

- రూ.కోటితో కొనుగోలు చేసి అందించిన ఎన్‌టీపీసీ
- మూడు రోజుల్లో అందుబాటులోకి తెచ్చేలా చర్యలు
- ఇప్పటివరకూ ఆస్పత్రిలో ఉన్న పదింటిలో మూలకు చేరిన ఏడు మెషీన్లు
- ప్రస్తుతం మూడింటితోనే సేవలు
- కొత్తవి అందుబాటులోకి వస్తే తీరనున్న సమస్య

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):

కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న రోగులకు ఊరట లభించనుంది. కేజీహెచ్‌లోని నెఫ్రాలజీ విభాగానికి ఒకేసారి పది డయాలసిస్ యంత్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ విభాగంలో మొత్తం పది యంత్రాలు ఉండేవి. సాంకేతిక సమస్యలతో ఏడు మెషీన్లు మూలకుచేరాయి. ఈ నేపథ్యంలో డయాలసిస్ సేవలకు ఇబ్బందులు ఎదురవుతుండడంతో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దానిపై స్పందించిన కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సమస్య పరిష్కారంపై దృష్టి సారించారు. భారీగా నిధులు అవసరమని ఆస్పత్రి అధికారులు చెప్పడంతో వివిధ కంపెనీల సీఎస్ఆర్ నిధులతో సమకూర్చేందుకు హామీ ఇచ్చారు.



ఆస్పత్రికి చేరిన కొత్త డయాలసిస్ మెషిన్లు

ఎన్‌టీపీసీ ఉదారత

ఈ నేపథ్యంలో పరవాడలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) అధికారులను సంప్రతించి, సీఎస్ఆర్ నిధులతో యంత్రాల కొనుగోలుకు ఒప్పించారు. దీంతో సంస్థ కోటి రూపాయలు వెచ్చించి పది డయాలసిస్ మెషీన్లను కొనుగోలు చేసింది. అవి కేజీహెచ్‌కు చేరాయి. మరో మూడు రోజుల్లో నెఫ్రాలజీ విభాగంలో వాటిని ఇన్‌స్టాల్ చేసి ... మిగతా 6వ పేజీలో

జేఎన్‌ఆర్‌కు హౌసింగ్ చెక్

... 5వ పేజీ తరువాయి

నిర్మించే ఇళ్ల నాణ్యత పరిశీలించిన అనంతరం బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు అవకాశం ఇస్తారు. ప్రధానంగా మూడో ఆప్షన్ కింద లబ్ధిదారుల తరఫున కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న ఇళ్ల నాణ్యత పరిశీలించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 65 లేఅవుట్‌లలో పలు దశల్లో నిర్మిస్తున్న ఇళ్ల నాణ్యతను పరిశీలించే పనిలో అధికారులు ఉన్నారు. జిల్లాలో మొత్తం లక్ష ఇళ్లలో సుమారు 35 వేలు జేఎన్‌ఆర్ కంపెనీయే నిర్మిస్తోంది. వైసీపీ నేతకు చెందిన కంపెనీ కావడంతో జగన్ ప్రభుత్వంలో అనేక జిల్లాల్లో వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణ బాధ్యతలు దక్కించుకుంది. విశాఖ జిల్లాలో పెద్ద లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న జేఎన్‌ఆర్ కంపెనీకి హౌసింగ్‌లో కొందరు అధికారులు వత్తాసు పలుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇద్దరు, ముగ్గురు ఏఈలు కూడా ఈ కంపెనీకి అనుకూలంగా ఉంటున్నారనేది బహిరంగ రహస్యం. అయితే ఇప్పుడు నెల్లూరుకు చెందిన ఎమ్మెల్యే ఆరోపణల నేపథ్యంలో అన్ని జిల్లాల్లో ఆ కంపెనీకి చెందిన ఇళ్ల నిర్మాణంపై విచారణ పూర్తయిన తరువాతే బిల్లులపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కాగా జిల్లాలో ఇతర నిర్మాణ సంస్థలు నిర్మించిన సుమారు 5,500 ఇళ్లకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్‌కు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. గురువారం వరకూ 4,100 ఇళ్ల నాణ్యతను పరిశీలించి వాటి ఫొటోలు, దశల వారీగా చెల్లించే బిల్లుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ ఇళ్లకు సుమారు రూ.10 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకూ తనిఖీ చేసిన ఇళ్లలో ఒకటి, రెండు శాతం మినహా మిగిలిన ఇళ్ల నాణ్యత బాగానే ఉందని హౌసింగ్ పీడీ సీహెచ్ సత్తిబాబు పేర్కొన్నారు. పైడివాడ అగ్రహారంతోపాటు పలుచోట్ల ఇళ్లకు తలుపులు బిగించలేదని గుర్తించామన్నారు. లబ్ధిదారులకు ఇళ్లు అందజేసే సమయంలో తలుపులు బిగించి ఇవ్వాలని నిర్మాణ సంస్థలకు స్పష్టం చేశామన్నారు.

గూగుల్ రాకతో రియల్టర్ల హడావిడి

... 5వ పేజీ తరువాయి

1,000 ఎకరాల వరకూ తీసుకుంది. పేదల ఇళ్లు, వీఎంఆర్‌డీఏ ఎంఐజీ లేఅవుట్‌లకు సమీకరించిన భూములకుగాను ఎకరాకు అభివృద్ధి చేసిన 900 గజాలు, 450 గజాల ప్లాట్లు ఇచ్చారు. ఆ ప్లాట్లు ఒకేచోట ఇవ్వడంతో ఇప్పుడు వాటిపై రియల్టర్ల కన్ను పడింది. గంపగుత్తగా కొనుగోలు చేసి భవిష్యత్తులో వెంచర్లు వేసుకోవాలని భావిస్తున్నారు. అలాగే ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్న కొందరు నేతల బంధువులు కూడా విశాఖలో భూముల గురించి ఆరా తీస్తున్నారు. ఒక కీలక నేత కుమారుడు రెండు రోజులుగా విశాఖలోనే మకాం వేసి ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల్లో భూములు కొనుగోలుకు తెలిసిన బ్రోకర్ల ద్వారా మంతనాలు చేస్తున్నారు. మరో కీలక నేత బంధువులు విశాఖ నగరానికి సమీపంలో గల గ్రామాల్లో భూములు వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. డేటా సెంటర్ రాకతో మండలంలో భూములకు డిమాండ్ పెరిగిందని ఆనందపురానికి చెందిన టీడీపీ నేత ఒకరు వ్యాఖ్యానించారు. భూముల కోసం వారం రోజులుగా వ్యాపారులు వస్తున్నారని గిడిజాల రైతులు పేర్కొన్నారు.

రయ్..రయ్

... 5వ పేజీ తరువాయి

హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళుతున్నాయి. అందుకని అధికారులు ఎన్‌ఏడీ, కూర్మన్నపాలెం జంక్షన్లలో ఎక్కువగా తనిఖీలు చేపట్టారు. అలాగే అనకాపల్లి వద్ద కూడా తనిఖీలు నిర్వహించారు. అత్యధిక శాతం బస్సుల్లో ఫైర్ ఎక్సిటింగ్‌గుషర్లు కండిషన్‌లో లేవని గుర్తించి కేసులు నమోదు చేశారు. తమిళనాడులో రిజిస్టర్ అయిన బస్సు పర్మిట్ గడువు ముగిసినా తిప్పుతున్నట్టు గుర్తించి శుక్రవారం రాత్రి రూ.2,03,00 జరిమానా వేశారు. బీమా పత్రాలు చూపించకపోవడంతో మరో రెండు బస్సులపై కేసులు పెట్టారు. ఎమర్జన్సీ ఎగ్జిట్ సరిగ్గా లేదని రూ.21,200 జరిమానా వేశారు.

పర్మిట్ లేకుండా వస్తే కేసులు తప్పవు

- ఆర్.శ్రీనివాసరావు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్

సరైన పర్మిట్లు, అనుమతులు లేకుండా ట్రావెల్స్ బస్సులను రోడ్డపైకి తీసుకువస్తే దానికి యజమానులే బాధ్యులు. ఈ నెల 13వ తేదీ నుంచి తనిఖీలు నిర్వహించి ఇప్పటివరకూ 58 కేసులు నమోదు చేశాం. నాలుగు సీజ్ చేశాం. మొత్తం రూ.9,58,480 జరిమానా వసూలు చేశాం.







వార్డుల్లో అభివృద్ధి పనులపై జడ్సీ సమీక్ష

కొమ్మాది, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్-2 పరిధిలోని 5, 6, 7, 8 వార్డుల్లో అభివృద్ధి పనుల పురోగతి, ఆయా వార్డుల్లోని సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఎమ్మెల్యే గంటా ఆదేశించడంతో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి శుక్రవారం తన కార్యాలయంలో ఆయా వార్డుల టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నాయకులను ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీధి లైట్లు, డ్రైనేజీలు, రోడ్లు, పార్కుల అభివృద్ధి గురించి నాయకులు జడ్సీకి వివరించారు. టీడీపీ సీనియర్ నాయకుడు దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనలో ఆరో వార్డు పూర్తిగా వెనుకబడి ఉందని, రోడ్లపై గోతులు కూడా పూడ్చడం లేదని తెలిపారు. అనంతరం వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను జడ్సీ ఆదేశించారు. సమావేశంలో 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 6వ నాయకులు గరే గురునాథ్, యార్లగడ్డ జీవన్ కుమార్, దాసరి శ్రీనివాస్, పిళ్లా వెంకట్రావు, నాగోతి సూర్యప్రకాశ్, గొల్లంగి ఆనందబాబు, నాగోతి వెంకట్రావు, లొడగల జానకీ రామ్, తదితరులు పాల్గొన్నారు.


ప్రజాప్రతినిధులతో సమావేశమైన జడ్సీ కనకమహాలక్ష్మి


తిరువీధిలో స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు

అప్పన్న సన్నిధిలో వైభవంగా తిరువీధి

సింహాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శుక్రవార తిరువీధి ఉత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రోచ్చారణలు, భక్తుల హరినామస్మరణ నడుమ బేడా మండపంలో తిరువీధి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మార్గంలో అష్టదిక్పాలకులకు షోడశోపచారాలు సమర్పించి ఫల నివేదనలు, నీరాజనాలిచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

తగరపువలస, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సాయి సంహిత సంస్థ అధ్యక్షుడు, తెలుగు ఉపాధ్యాయుడు ఆర్. అప్పలరాజు శుక్రవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. వీటిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీవాణి చేతుల మీదుగా అందజేశారు.

కిడ్నీ రోగికి ఆర్థిక సాయం

ఆనందపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తుడు లంక బంగారురాజుకు మేము సహితం స్వచ్ఛంద సేవా సంస్థ శుక్రవారం రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేసింది. రాజు కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. అతని ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఎర్ర వెంకటప్పారావు, వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కిరెడ్డి దేముడుబాబు, కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు జె. రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు

భీమునిపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ జూనియరు కళాశాలలో కేజీబీవీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను సీఐ తిరుమలరావు,ఎస్ఐ గౌరి పర్యవేక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామ్ ప్రసాద్ విజేతలకు బహుమతులు అందించారు.

'ప్రజా ఉద్యమం' పోస్టర్ ఆవిష్కరణ

ఎండాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 28న జరగనున్న ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన 8వ వార్డులోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో భాగంగా తొలుత తగరపువలస ఫుట్‌బాల్ మైదానం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు. అనంతరం ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పలువురు సీఐల బదిలీ

... 5వ పేజీ తరువాయి

జి.అర్జున్‌ను సీ పోర్టు ఇమ్మిగ్రేషన్ అధికారిగా పంపారు. సీ పోర్టు ఇమ్మిగ్రేషన్ అధికారిగా ఉన్న వి.శ్రీనివాసరావును సిటీ వీఆర్‌కు అటాచ్ చేశారు. ఎయిర్‌పోర్టు ప్రొటోకాల్ అధికారిగా ఉన్న మలిరెడ్డి నాగేశ్వరరావును సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఎయిర్‌పోర్టు సీఐగా ఉన్న జి. ఉమామహేశ్వరరావును సిటీ వీఆర్‌కు అటాచ్ చేశారు. సీసీఎస్ సీఐగా ఉన్న వి.శంకర్ నారాయణను ఎయిర్‌పోర్టు లా అండ్ ఆర్డర్ సీఐగా బదిలీ చేశారు. కొత్త బాధ్యతలు వెంటనే చేపట్టాలని కమిషనర్ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

తగరపువలస, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు చిల్లపేటకు చెందిన తిప్పాన సురేశ్ (27) కొద్ది రోజులుగా కనిపించడం లేదని అతని మామయ్య భాస్కరరెడ్డి భీమిలి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సురేశ్ స్వగ్రామం విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కోనాడ కాగా, ఉద్యోగ అన్వేషణలో భాగంగా చిల్లపేటలోని మామయ్య ఇంట్లో ఉంటున్నాడు. డిగ్రీ చదివిన అతనికి జయభేరి మోటార్స్‌లో ఉద్యోగం వచ్చిందని ఆగస్టు 28న ఇంట్లో చెప్పి వెళ్లిపోయాడు. తరువాత నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో కుటుంబ సభ్యులు విశాఖలోని జయభేరి సంస్థ కార్యాలయానికి వెళ్లి వాకబు చేయగా అటువంటి వ్యక్తి ఎవరూ లేరని, తాము ఉద్యోగం ఇవ్వలేదని చెప్పారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఔషధ రంగంలో అపార అవకాశాలు

సాగర్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధతో ఔషధ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని, నూతన ఔషధాల తయారీ నుంచి నాణ్యతా ప్రమాణాలను పరీక్షించే దశ వరకు ఏఐ (కృత్రిమ మేధ) నిపుణుల అవసరం ఉందని పారిశ్రామికవేత్తలు వెల్లడించారు. గీతం వర్సిటీ వేదికగా ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ) ఔషధ రంగంలో కృత్రిమ మేధ అన్న అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ డాక్టర్ ఎస్. అనంత రామకృష్ణ, ఫార్మశీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాస్, నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ క్లినికల్ ఫార్మకాలజీ విభాగం అధిపతి ప్రభాకరరెడ్డి, పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవంపై వ్యాసరచన పోటీలు

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని పలు పాఠశాలల్లో విద్యార్థులకు మండల స్థాయిలో వ్యాసరచన, క్విజ్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఎంఈఓలు శివరాణి, జయప్రద ఆధ్వర్యంలో మండలంలోని 16 ఉన్నత పాఠశాలల్లోనూ పోటీలు జరిగాయి. పరిశీలకులుగా భీమిలి డైట్ కళాశాల అధ్యాపకులు స్వామి, సుబ్బలక్ష్మి వ్యవహరించారు. విజేతలకు ఈనెల 29, 30వ తేదీల్లో భీమిలిలో నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామని ఎంఈఓ శివరాణి తెలిపారు.

పీఎంఏవై 2.0లో 3,400 ఇళ్లు

... 5వ పేజీ తరువాయి

నడుపూరు, దువ్వాడ, అగనంపూడి, దేశపాత్రునిపాలెం, ముదపాక, జెర్రిపోతులపాలెం తదితర లేఅవుట్‌లకు నీటి సరఫరా కోసం రూ.139.32 కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మిగిలిన కాలనీలకు జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.472.7 కోట్లు అవసరమని ప్రతిపాదనల్లో పేర్కొన్నామన్నారు. అనకాపల్లి, గాజువాక, పెందుర్తి, విశాఖ పశ్చిమ నియోజకవర్గాల్లో ఉన్న కాలనీలకు పోలవరం కాలువ నుంచి, భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఇళ్లకు గోస్తనీ నది నుంచి నీటి సరఫరా జరుగుతుందన్నారు. విద్యుత్ సరఫరా కోసం ఈపీడీసీఎల్ అధికారులు కాలనీల వారీగా సర్వేలు చేసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారన్నారు. రోడ్లు, డ్రైన్ల కోసం ప్రతిపాదనలు రూపొందించాలని నిర్ణయించామన్నారు. కాలనీల్లో తక్కువ ఖర్చుతో మ్యాజిక్ డ్రైన్లు నిర్మించేలా గ్రామీణ నీటి సరఫరా విభాగం ప్రతిపాదిస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టే కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అగనంపూడి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో బినామీలపై సర్వే పూర్తిచేశామన్నారు. బినామీలు ఉన్న ఇళ్లకు నోటీసులు ఇచ్చామని, ఖాళీగా ఉన్న ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామని సత్తిబాబు పేర్కొన్నారు.

కిడ్నీ రోగులకు ఊరట

... 5వ పేజీ తరువాయి

రోగుల సేవలకు వినియోగిస్తామని ఆస్పత్రి అధికారులు తెలిపారు. దీంతో డయాలసిస్ రోగులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

ప్రస్తుతం మూడు మెషీన్లతోనే...

గతంలో నెఫ్రాలజీ విభాగంలో మొత్తం పది మెషీన్లతో ప్రతిరోజూ 20 నుంచి 30 మంది కిడ్నీ బాధితులకు డయాలసిస్ చేసేవారు. మూడు నెలలుగా ఏడు మెషీన్లు పనిచేయకపోవడంతో కేవలం మూడింటితోనే నెట్టుకొస్తున్నారు. రోగులకు ఇబ్బంది లేకుండా పీపీపీ విధానంలో ఆస్పత్రి ఆవరణలో నిర్వహిస్తున్న నెఫ్రోప్లస్ సెంటర్‌లో కొంతమందికి డయాలసిస్ సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ప్రతిరోజూ 50 నుంచి 70 మంది రోగులకు నెఫ్రోప్లస్, నెఫ్రాలజీ విభాగంలో డయాలసిస్ చేస్తున్నారు. తాజాగా కొత్త మెషీన్లు అందుబాటులోకి రానుండడంతో రోగుల ఇబ్బందులకు తెరపడుతుందని చెబుతున్నారు. ఇన్‌స్టాలేషన్ పూర్తయిన తరువాత ప్రతిరోజూ నెఫ్రాలజీ విభాగంలోనే 40 నుంచి 50 మంది రోగులకు సేవలందిస్తామంటున్నారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ ప్రత్యేక చొరవతో మెషీన్లు వేగంగా అందుబాటులోకి వచ్చాయని ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ తెలిపారు.

కశింకోట పూర్వ కార్యదర్శి ఆర్థిక అవకతవకలు

- కలెక్టర్‌కు, డీపీవోకు డిప్యూటీ ఎంపీడీవో ఫిర్యాదు
- ప్రస్తుతం చిప్పాడలో పనిచేస్తున్న కార్యదర్శి

కశింకోట, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : కశింకోట పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన ఎస్. రామచంద్రరావు ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్టు డిప్యూటీ ఎంపీడీవో తోటారావు కలెక్టర్ విజయకృష్ణన్‌కు, డీపీవో సందీప్‌కు, ఎంపీడీవో చుక్కా చంద్రశేఖరరావుకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం భీమునిపట్నం మండలం చిప్పాడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రామచంద్రరావు..కశింకోట నుంచి రిలీవ్ అయిన సమయంలో పంచాయతీకి సంబంధించిన రికార్డులను పూర్తిస్థా యిలో సమర్పించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. 2025 మార్చి 31వ తేదీ వరకు ఆస్తి పన్ను రూపేణా రూ.55,41,693 కాగా, రూ. 34,81,478 మాత్రమే 'స్వర్ణ పంచాయతీ' ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేశారని తెలిపారు. మిగిలిన రూ.20,60,215 ఇంత వరకు జమ చేయలేదని పేర్కొన్నారు. అలాగే 2024-25 ఇళ్ల పన్నులకు సంబంధించి రికార్డులను సరిగా నిర్వహించలేదని, 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి క్యాష్ బుక్ నిర్వహణ కూడా సరిగా లేదన్నారు.

ఇంకా వివిధ పనుల పేరు తో డ్రా చేసిన డబ్బులకు సంబంధించి ఎటువంటి సంతకాలు లేవని పేర్కొన్నారు. పరికరాలు, ఇతర సామగ్రి కొనుగోలు చేసి, స్టాక్ రిజిస్టర్‌లు నిర్వహించలేదని, వీటిపై పలుమార్లు సమాచారం అడిగినా స్పందించలేదని, దీంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని డిప్యూటీ ఎంపీడీవో తోటారావు పేర్కొన్నారు.

స్టాండింగ్ కమిటీలో కమీషన్ లొల్లి

... 5వ పేజీ తరువాయి

చేతిలో పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం (బుధవారం) జరిగిన స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాల్లో కొందరు కాంట్రాక్టర్ల నుంచి రూ.25 లక్షలు వసూలు చేశారని, అందులో ఆరు శాతం కింద సభ్యులకు రూ.14 లక్షలు కేటాయించి, 11 వాటాలు వేశారని. మిగిలిన రూ.11 లక్షలను నాలుగు శాతం కింద కీలక నేతకు ఇచ్చి నట్టు చెబుతున్నారని స్టాండింగ్ కమిటీలోని ఒక సభ్యుడు ఆరోపించారు.అయితే వసూలైన మొత్తాన్ని 11 వాటాలు వేయాలని కొందరు సభ్యులు పట్టుబట్టినట్టు సమాచారం. తాజా పరిణామాల నేపథ్యంలో భవిష్యత్తులో స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో ఏం జరుగుతుందోననే చర్చ కార్పొరేటర్లలో చర్చ జరుగుతుండడం విశేషం.


ప్రహరీ గోడ కోతకు గురవ్వకుండా కాలువ తవ్విస్తున్న స్థానికులు

ఎమ్మెల్యే ఆదేశించినా.. పట్టించుకోరా..?

ఆనందపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ఏడాది కురిసిన వర్షాలకు గోడ కోతకు గురై పక్కనున్న ఇళ్లపై పడింది. కొన్ని ఇళ్లు పాక్షికంగా దెబ్బతినడంతో పాటు పార్కింగ్ చేసిన బైక్‌లు పాడయ్యాయి. ఎమ్మెల్యే గంటా పాఠశాలను సందర్శించి వెంటనే ప్రహరీ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. కానీ ఏడాది కావస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి ఆ ప్రదేశం మళ్లీ కోతకు గురైంది. కాగా సర్పంచ్ రమణ, ఎంఈవో గంగరాజు శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి, వర్షం నీరు పునాదుల్లో చేర కుండా జేసీబీతో కాలువ తవ్వించారు.







గుంతలమయంగా ముస్తఫానగర్ రహదారులు

» రాకపోకలు సాగించే లేని దుస్థితి



గోతులతో నిండిన రహదారి

ఆరిలోవ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 11వ వార్డులో గల ముస్తఫానగర్‌లోని వీధి రోడ్లు ఎక్కడికక్కడే గుంతలు పడి ఉన్నాయి. దీంతో చిన్న వర్షం వచ్చినా అందులో నీరు చేరి రోడ్డు అధ్వానంగా తయారవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోడ్డు గోతులమయం కావడంతో ఇక్కడ ప్రయాణించడం కూడా ఇబ్బందిగా ఉంటోందని వాపోతున్నారు. గుంతలమయమైన ఈ రోడ్డులో రాకపోకలు సాగించినప్పుడు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నామని ద్విచక్ర వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జాతీయ స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు నడుపూరు విద్యార్థి

భీమునిపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు నడుపూరు ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్ నిఖిల్ ఎంపికైనట్టు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 23, 24వ తేదీల్లో విజయవాడలోని మురళీ రిసార్ట్స్‌లో రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలు జరిగాయి. ఇందులో నిఖిల్ విజువల్ ఆర్ట్స్ 3డి విభాగంలో ప్రథమ స్థానం పొందాడు. ఈమేరకు నిర్వాహకులు విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అలాగే అదే పాఠశాలకు చెందిన విద్యార్థులు జానపద నృత్యం విభాగంలో ద్వితీయ బహుమతి గెలుపొందగా ఆరిపాక విద్యార్థులు కె. నీలవేణి, కె. దిలీప్ సంప్రదాయ బొమ్మలు 2డి విభాగంలో ద్వితీయ బహుమతి, శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థి పి. ధనలక్ష్మి చిత్రలేఖనం 2డి విభాగంలో తృతీయ బహుమతి సాధించారు. విజేతలను డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ అభినందించారు

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మ** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి** : సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 17, టమాటా 36, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 34, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 30, బీరకాయలు 36, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 26, క్యారెట్ 64, దొండకాయలు 40, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 70, బరబాటి 40, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 24, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 48, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

పార్కు నిర్వహణపై నిర్లక్ష్యం

» గాలివాన దెబ్బకు అస్తవ్యస్తంగా మారిన కేఆర్ఎం పార్కు
» పార్కు మధ్యలో దుంగలు..
» పాడైన లైట్లు.. చీకటి పడితే అంధకారంలో పరిసరాలు



పార్కులో అడ్డంగా ఉన్న చెట్టు దుంగలు

వెంకోజీపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల ఆటపాటలతోలు, యువకుల సందడి, కాలక్షేపం చేసే వృద్ధులతో కళకళలాడాల్సిన పార్కు ఒక్క గాలివానకు 16వ వార్డులోని కేఆర్ఎం కాలనీలో పార్కు అస్తవ్యస్తంగా తయారైంది. గత నెలలో వీచిన గాలివానకు పార్కులోని పెద్ద వృక్షం నేలకొరిగింది. విద్యుత్ దీపాలు కూడా విరిగి పడిపోయాయి. చాలా రోజుల పాటు జీవీఎంసీ ఉద్యానవన అధికారులు పట్టించుకోకపోవడంతో నేలకొరిగిన వృక్షాన్ని పార్కు నిర్వాహకులు ముక్కలుగా కోయించుకున్నారు. అయినప్పటికీ వాటి తరలింపునకు గ్రేటర్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పార్కులో ఆ దుంగలు పడి ఉన్నాయి. దీంతో పార్కుకు వచ్చే వారికి ఇవి ఇబ్బందిగా తయారయ్యాయంటూ పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు ఆడుకోవడానికి, పెద్దలు వాకింగ్ చేయడానికి ఈ దుంగలు అడ్డుగా ఉన్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో చెత్త తరలించని విధంగా పార్కుల విషయంలో కూడా ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం జీవీఎంసీ అధికారులకు తగదని మండిపడుతున్నారు. పార్కుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తరచూ చెప్పే జీవీఎంసీ అధికారులు వాస్తవంలోకి వచ్చేసరికి మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు, పార్కు సందర్శకులు, వాకర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వెలగని విద్యుత్ దీపాలు

పార్కు మధ్యలో ఉన్న హైమాస్ట్ లైట్లు కూడా విరిగి పాడవడంతో రాత్రి వేళల్లో ఈ ప్రాంతమంతా చీకటిగా ఉంటోందని అంటున్నారు. ఈ విషయమై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. చీకటిగా ఉండడంతో కొందరు పార్కులో చెత్తాచెదారం వేస్తున్నారని అంటున్నారు. ఇన్నాళ్లు ఈ పార్కు నిర్వహణపై తాము ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నామని, అయితే జీవీఎంసీ నుంచి ఎలాంటి సహకారం లేకపోవడంతో ప్రస్తుతం ఏమీ చేయలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ పార్కు నిర్వహణపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

సొంత డబ్బులతో నిర్వహించుకుంటున్నాం



తమ సొంత నిధులతో లక్షల రూపాయలు వెచ్చించి పార్కును అభివృద్ధి చేసుకున్నాం. ప్రతిరోజూ పార్కుకు వచ్చే వారి నుంచి కొంత మెయింటెనెన్స్ కోసం వసూలు చేస్తూ పార్కు అభివృద్ధిని చేసుకుంటున్నాం. మా పరిమితి మేరకు పార్కు నిర్వహణ చేయగలం. కానీ ఇటువంటి ప్రకృతి వైపరీత్యాల వలన్ల కలిగే అపార నష్టాలను కూడా జీవీఎంసీ వారు పట్టించుకోకపోవడం అన్యాయం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకుని, పార్కులో దుంగలు తొలగించాలి. విద్యుత్ లైట్లను అమర్చాలి. చిన్నారులు ఆడుకునే క్రీడ సామగ్రిని బాగు చేయాలి.

- రవి, పార్కు నిర్వాహక కమిటీ ప్రతినిధి

ఘనంగా ఐ.రా.స. ఆవిర్భావ దినోత్సవం



వివిధ దేశాల జాతీయ పతాకాల చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఐక్యరాజ్యసమితి అవిర్భావ దినోత్సవాన్ని చినగదిలి సంతపాలెంలో గల మండల ప్రాథమిక పాఠశాలలోవ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా విద్యార్దులు ఒక్కో దేశానికి ప్రాతినిధ్యం వహించారు. ఆయ దేశాల జెండాలను ప్రదర్శించారు.

అనంతరం ఐక్యరాజ్య సమితి కార్యకలాపాల గురించి చర్చించారు. అలాగే ప్రపంచ దేశాల్లో నెలకొన్న రాజకీయ, యుద్ధ వాతావరణం గురించి చర్చించారు. ఉపాధ్యాయుల ఐక్యరాజ్య సమితి కార్యకలాపాల గురించి విద్యారులకు వివరించారు. అనంతరం రౌండ్ టేబుల్ సమితి, మాక్ అసెంబ్లీ రౌండ్ టేబుల్ విధానంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు డీవీఎస్ రాజా, ఉపాధ్యాయులు విజయభాను కోటి, , శోభా నిర్మలా, వాణి జయప్రద, పద్మావతి పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు నెలవారీ జీతాలివ్వాలి



ఏయూ రిజిస్ట్రార్ రాంబాబుకు వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : యూనివర్సిటీలోని అతిథి అధ్యాపకులకు నెలవారీ జీతాలు చెల్లించాలని, కనీస వసతులు ఏర్పాటు చేయాలని అతిథి అధ్యాపకులు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య రాంబాబును కోరారు. వీరంతా రిజిస్ట్రార్‌ను శుక్రవారం కలిసి వినతపత్రం అందజేశారు. యూనివర్సిటీలో పని చేస్తున్న ఏజెంట్ ప్రొఫెసర్, పీవోపీలను నిర్దేశిత కాలం పూర్తయిన సందర్భంగా వారిని వెనక్కు పంపాలని, వారిస్థానంలో గెస్ట్ ఫ్యాకల్టీలకు అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్రంలోని ఇతర యూనివర్సిటీల్లో గెస్ట్ ఫ్యాకల్టీలకు నెలవారీ జీతాలు ఇస్తున్నారని, ఇక్కడ కూడా అదే విధానాన్ని అనుసరించాలని కోరారు.

రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో అధ్యాపకులు సురేష్ మేనన్, డాక్టర్ శేషు, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ విక్రమ్, డాక్టర్ వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

14 నుంచి నరెడ్కో వైజాగ్ ప్రాపర్టీ ఫీస్ట్-2025



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు

మహారాణిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, స్థిరాస్తి రంగం వ్యాపారులు మరిన్ని పెట్టుబడులతో ముందుకు రావాలని విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్ పిలుపునిచ్చారు. నరెడ్కో అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబరు 14 నుంచి 16 వరకు బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహించనున్న నరెడ్కో వైజాగ్ ప్రాపర్టీ ఫీస్ట్-2025 బ్రోచర్‌ను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తదితరులతో కలిసి ఎంపీ శ్రీభరత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విశాఖ నగరానికి పెద్ద పెద్ద కంపెనీలు వస్తున్నాయని, పెద్ద ప్రాజెక్టులు రావాలంటే పెద్ద ఆలోచనలే చేయాలన్నారు. అభివృద్ధికి అనుగుణంగా అవకాశాలు అందిపుచ్చుకొనే ఆలోచనలతో ముందుకు అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధికి విశాఖలో అడుగులు పడుతూ ఉంటే ప్రతిపక్షాలు అడ్డుకునే విధంగా విమర్శలు చేస్తున్నాయని అన్నారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ విశాఖకు గూగుల్ సంస్థ రావటంతో పెద్ద సంఖ్యలో పెట్టుబడులు వస్తున్నాయని, నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశేష కృషి చేస్తున్నారని అన్నారు. వచ్చే మూడేళ్లలో విశాఖ రూపురేఖలు మారతాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి విశాఖ మీదుగా కోనసీమ వరకు రహదార్లు విస్తరిస్తున్నామని, వీఎంఆర్డీఏ పరిధిలో ఏడు మాస్టర్ ప్లాన్ రోడ్లు వేగంగా వేస్తున్నట్లు తెలిపారు. రూ.550 కోట్ల ఐఎఫ్‌సీ రుణానికి వెళ్తున్నట్లు తెలిపారు. విశాఖకు నిరంతరం నీరందించే, నీటిశుద్ధి ప్లాంట్‌లు వస్తున్నాయని వెల్లడించారు. ఈ సమావేశంలో నెరెడ్కో నాయకులు పి.రాజశేఖర్, ఎరమేష్ బాబు, జి.చక్రధర్, రాహుల్ శండేనియా, వెంకన్న చౌదరి, పలువురు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్న నిత్యాన్నదాన పథకానికి రూ. 2 లక్షల విరాళం

సింహాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి ఒడిశాలోని పర్లాకిమిడి ప్రాంతానికి చెందిన బళ్ల సింహాచలం, పద్మావతి దంపతులు, అదే కుటుంబానికి చెందిన బళ్ల మధు, లావణ్య దంపతులు రూ. 2 లక్షలు విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని డీడీల రూపంలో ఆలయ పర్యవేక్షణాధికారులు పాలూరి నరసింగరావు, పి. సునీల్‌కు శుక్రవారం వారు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించారు.

ఆహార నాణ్యత లోపంపై ప్రత్యేకాధికారి ఆగ్రహం



వంటలను పరిశీలిస్తున్న జ్ఞానవేణి

పద్మనాభం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు ఆరోగ్యవంతమైన పోషకాహారం అందించాలని మండల ప్రత్యేకాధికారి కె.జ్ఞానవేణి ఆదేశించారు.శుక్రవారం ఆమె పొట్నూరుగ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పిల్లలకు వండిన ఆహార పదార్థాల నాణ్యతపై పెదవి విరిచారు. పాడైన కోడిగుడ్లు వినియోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఇటువంటి వాటిని తనిఖీ చేయాలని సూచించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. జెడ్పీ పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అక్కడి నుంచి మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంగన్వాడీ, పాఠశాలలు పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఎటువంటి లోపాలున్నా సరిదిద్దడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కె.రూపేష్, ఎంఈవో రమణ, ఆర్ఐ శ్యామల, ఐసీడీఎస్‌సూపర్‌వైజర్ పార్వతి పాల్గొన్నారు.

పెదజాలారిపేటలో పైపులైన్లకు మరమ్మతులు



పైపులైన్లు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పెదవాల్తేరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేట మెయిన్ రోడ్డు, ఆదర్శ గ్రామంలో కొళాయి పైపులైన్లను శుక్రవారం నీటి సరఫరా విభాగం సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. పెదజాలారిపేటలో ఎక్కడికక్కడే పైపులైన్ల లీకేజీ శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనానికి స్పందించిన జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. పెదవాల్తేరు మెయిన్ రోడ్డు, ఆదర్శ గ్రామం తదితర ప్రాంతాల్లో పైపులైన్లకు మరమ్మతులు చేపట్టారు. నీటి సరఫరా సిబ్బంది మరమ్మతులు చేయడంతో పెదజాలారిపేట, ఆదర్శ గ్రామం, రామలయం వీధి, చేపల మార్కెట్, గాంధీ బొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల్లో కొళాయిల్లో నీటి ధార ఎక్కువగా వస్తుందని ఆయా ప్రాంతాల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

లిక్విడ్ గంజాయి తరలింపు కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు



నిందితుడ్ని అరెస్టు చేసిన పోలీసులు


మహారాణిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): లిక్విడ్ గంజాయిని తరలించిన కేసులో ప్రధాన నిందితుడ్ని పట్టుకున్నట్లు టూటౌన్ సీఐ దివాకర్ యాదవ్ తెలిపారు. ఆగస్టులో లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను మహారాణిపేట పోలీసులు పట్టుకున్నారు. అందులో ప్రధాన నిందితుడైన గూడే దిలీప్ కుమార్ పోలీసులకు దొరక్కుండా గోవా తదితర ప్రాంతాల్లో ఉండిపోయాడు. ఈ క్రమంలో అతనిపై నిఘా ఉంచిన పోలీసులు దిలీప్ విశాఖకు రావటంతో పట్టుకున్నారు. నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకున్న సీఐ దివాకర్ యాదవ్, హెడ్ కానిస్టేబుల్ సురేష్, చంద్రశేఖర్, కానిస్టేబుల్ నాగేంద్రలను పోలీసు కమిషనర్ బాగ్చి, ఇతర అధికారులు అభినందించారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

» రోజ్‌గార్ మేళాలో ఎంపీ శ్రీభరత్
» 100 మందికి ఉద్యోగ నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, విశాఖ పోస్ట్‌మాస్టర్ జనరల్ వీఎస్ రవిశంకర్, తపాల శాఖ సీనియర్ సూపరింటెండెంట్ గజేంద్రకుమార్



వర్చువల్‌గా మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

సిరిపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగం పొందిన వారు సర్వీస్‌కాలంలో అంకితభావంతో పని చేయాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. శుక్రవారం సిరిపురం వీఎంఆర్డీఏ థియేటర్‌లో తపాలశాఖ ఆధ్వర్యంలో రోజ్‌గార్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో 50 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేయడం విశేషమన్నారు. వేలాది మందికి ఉద్యోగం నియామక పత్రాలు కల్పించినందుకు ప్రధానమంత్రి మోదీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. విశాఖలో పోస్టల్, కస్టమ్స్, రైల్వే, నేవీలలో సుమారు 100 మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా మాట్లాడారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు మేళాను ఉద్దేశించి ఢిల్లీ నుంచి తన సందేశం అందించారు. యువత సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం నిబద్ధతతో నిర్వహిస్తున్న రోజ్‌గార్ మేళా మంచి అవకాశం అన్నారు. ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు డబుల్ ఇంజన్ నాయకత్వంలో భద్రతతో కూడిన భవిష్యత్తును కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ పోస్ట్‌మాస్టర్ జనరల్ వీఎస్ రవిశంకర్, తపాల శాఖ సీనియర్ సూపరింటెండెంట్ గజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాగులచవితి పూజలకు పుట్టలు సిద్ధం



ముడసర్లోవ పార్కులో సిద్ధం చేసిన పుట్ట

ఆరిలోవ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాగులచవితి సందర్భంగా నాగేంద్రుడికి పూజలు చేసేందుకు ముసడర్లోవ పార్కు వద్ద పుట్టలను ముసడర్లోవపార్కు సిబ్బంది సిద్ధం చేశారు. ప్రకృతి సిద్ధమైన పుట్టలు ఈ పార్కులో ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో ఈ పార్కుకు వచ్చి పూజలు చేస్తారు. ఈ నేపథ్యంలో పార్కులో ఉన్న పుట్టలను సిబ్బంది శుభ్రం చేసి పూజలకు సిద్ధంగా ఉంచారు. అలాగే జూ పార్కు, కంబాలకొండలో ఉన్న పుట్టలను అక్కడి సిబ్బంది శుభ్రపరిచారు. భక్తుల కోసం జూ పార్కు, కంబాలకొండ పార్కులను ఉదయం నుంచే అందుబాటులో ఉంచనున్నట్టు ఆయా కేంద్రాల అధికారులు వెల్లడించారు.

నగరానికి చేరుకున్న న్యూజిలాండ్ మహిళా క్రికెటర్లు

విశాఖపట్నం, స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహిళా ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీలో భాగంగా ఈనెల 26న ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఇంగ్లండ్‌తో తలపడనున్న న్యూజిలాండ్ జట్టు క్రికెటర్లు శుక్రవారం నగరానికి చేరుకున్నారు. నవీ ముంబాయి నుంచి చార్టెడ్ ఫ్లైయిట్‌లో సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుంచి ప్రత్యేక బస్సులో ద పార్కు హోటల్‌కు చేరుకున్నారు. కెప్టెన్ సోఫీ డివైన్‌తో పాటు సుజీ బేట్స్, జార్జియా ప్లిమ్మర్, అమేలియా, బ్రూక్ హాలిడే, మ్యాడీ గ్రీన్, ఇసాబెల్లా గేజ్, జెస్‌కెర్, రోజ్మేరీ మైర్, లియా తహుహు, ఈడెన్ కార్సన్, బ్రీ ఇల్లింగ్, రోడ్‌పాలీ, బెల్లా జేమ్స్ చేరుకున్నారు. ఈనెల 23న నవీ ముంబాయిలో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో 53 పరుగుల తేడాతో తొలి ఓటమి చెందిన న్యూజిలాండ్ ఇప్పటివరకు 6 మ్యాచ్‌లు ఆడి ఒక గెలుపు, మూడు ఓటమి, రెండు ఫలితం తేలని మ్యాచ్‌లో ఆరు పాయింట్లు సాధించింది. అయితే 23న భారత్‌పై ఓటమితో సెమీఫైనల్స్‌కు చేరే అవకాశాలు మూసుకుపోయాయి. దీంతో ఇప్పటికే ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, భారత్‌తో పాటు సెమీఫైనల్స్‌కు బెర్తు ఖరారు చేసుకున్న ఇంగ్లండ్‌కు ఆదివారం న్యూజిలాండ్‌తో జరగనున్న మ్యాచ్ నామమాత్రమే

వైసీపీ ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

మద్దిలపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించనున్నట్లు విశాఖ జిల్లా వైసీపీ అధ్యక్షుడు కె.కె.రాజు తెలిపారు. శుక్రవారం మురళీనగర్ ఎన్‌జీజీవోస్ కాలనీలోని ఓ ఫంక్షన్ హాలులో ప్రజా ఉద్యమం పేరిట పోస్టరు ఆవిష్కరించారు. అదే రోజున అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు ఉంటాయని తెలిపారు. వైసీపీ ముఖ్యనేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడే అవకాశం'

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో కార్డియో పల్మనరీ రిసెసిటేషన్ (సీపీఆర్) చేసి వ్యక్తి ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ అన్నారు. వర్సిటీ హెల్త్ సెంటర్‌లో సెయింట్ లూక్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, విజయ లూక్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, జేడీఎస్ హాస్పిటల్ శుక్రవారం నిర్వహించిన సీపీఆర్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సీపీఆర్‌పై తగిన తర్ఫీదు పొందాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడే అవకాశం ఉందన్నారు. ఇటీవల గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో యువత సీపీఆర్ నేర్చుకోవడం వల్ల మేలు జరుగుతుందన్నారు. జేడీఎస్ ఆస్పత్రి అనస్థీషియా వైద్యులు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు గుండెపోటు వచ్చిన సమయంలో సత్వరం స్పందించడం, సీపీఆర్ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ ఎన్.కిరణ్ కుమార్ ప్రతి వ్యక్తి సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏయూ వైద్యాధికారి డాక్టర్ జీపీవీరామేశ్వర్, జేడీఎస్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ షేక్ హాజీ మస్తాన్, ఎండీ పీటర్‌సన్ లూక్, సెయింట్ లూక్స్ గ్రూప్ సంయుక్త కార్యదర్శి ఎం.ఆశీర్వాద్ లూక్, ప్రీతంలూక్, ఏయూవైద్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ టేబుల్ టెన్నిస్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా విశాఖ శాఖ నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14, 17, 19 బాలురు, బాలికల టేబుల్ టెన్నిస్ టోర్నీ శనివారం నుంచి జరగనుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. గోపాలపట్నంలోని ఇండోర్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్‌లో మూడు రోజులు జరగనున్న ఈ టోర్నీలో రాష్ట్ర వ్యాప్తంగా 390 మంది క్రీడాకారులు, 76 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటారని పేర్కొన్నారు.

పరాయి పంచన ప్రభుత్వ కార్యాలయాలు..!

- బాలికల ఐటీఐ ప్రాంగణంలో జిల్లా ఉపాధి కార్యాలయం, ఎన్‌సీఎస్ సెంటర్
- ఖాళీ చేయాలని ఆదేశాలిచ్చినా పట్టించుకోని వైనం
- నిరుపయోగంగా జిల్లా ఉపాధి కార్యాలయంలో గదులు
- నూతన కోర్సులు అందుబాటులోకి రానుండడంతో సతమతం


జిల్లా ఉపాధి కార్యాలయం


వెలవెలబోతున్న రిజిస్ట్రేషన్ల హాల్


బాలికల ఐటీఐ పక్కన నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్

కంచరపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పరాయి పంచన నెట్టుకొస్తున్న ప్రభుత్వ కార్యాలయాలతో దీర్ఘకాలంగా అందులో నడుస్తున్న సంస్థలకు ఇబ్బందులు ఎదురవుతుండడంతో అసహనం, ఆగ్రహం వ్యక్తమవుతున్నాయి. కంచరపాలెంలోని బాలికల ఐటీఐ భవన సముదాయంలో సుమారు పదిహేనేళ్ల క్రితం జిల్లా ఉపాధి కార్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. బాలికల ఐటీఐలో శిక్షణ పొందేందుకు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థినులు రాకపోకలు సాగిస్తుంటారు. వీరికి వసతిగృహం నిర్వహణ కోసం గతంలో ఐటీఐని ఆనుకుని గ్రౌండ్, మొదటి అంతస్తుల్లో 24 గదులతో భారీ నిర్మాణం చేపట్టారు. అప్పట్లో జిల్లా ఉపాధి కార్యాలయాన్ని ఇందులోనే ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కాదనలేకపోయిన ఐటీఐ అధికారులు ప్రస్తుతం వారి అవసరాల దృష్ట్యా భవనాలు ఖాళీ చేయాలంటూ నెత్తీనోరూ కొట్టుకుంటున్నా సంబంధిత అధికారులు ససేమిరా అంటుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో ఉపాధి కల్పనశాఖ కమిషనర్ కూడా ఉపాధి కార్యాలయాన్ని ఖాళీ చేసి బాలికల ఐటీఐకి అప్పగించాలని విస్పష్టంగా ఆదేశించినా జిల్లా ఉపాధి కల్పనాధికారులు పట్టించుకోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. త్వరలో బాలికల ఐటీఐకి అప్&స్కోప్ పథకం ద్వారా నూతన ట్రేడులు మంజూరయ్యే అవకాశం ఉండడంతో ఖాళీ చేయాల్సిందేనని బాలికల ఐటీఐ అధికారులు పేర్కొంటున్నారు.

ఆదరణ కరువు

బాలికల ఐటీఐ భవనంలో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయానికి నిరుద్యోగుల నుంచి ఎటువంటి ఆదరణ లేదు. ఒకప్పుడు ఉపాధి కార్యాలయం పేరు వింటే నిరుద్యోగులు వెయ్యి కళ్లతో కాల్ లెటర్ల కోసం ఎదురుచూసేవారు. ప్రస్తుతం ఉపాధి కార్యాలయాల ద్వారా ఎటువంటి ఉద్యోగాలు రావడం లేదు. దీంతో స్వయం ప్రతిపత్తి లేక అధికారులు గోళ్లుగిల్లుకునే పరిస్థితి నెలకొంది. కేవలం 'రిజిస్ట్రేషన్ల కోసమే ఉపాధి కార్యాలయాలు' అన్న చందంగా మారడంతో రోజురోజుకు నిరుద్యోగుల నుంచి ఆసక్తి తగ్గిపోతోంది. పది, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు తమ అర్హత వివరాలను ఉపాధి కార్యాలయాల్లో నమోదు చేసుకోవడానికి అక్కడకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చారు. దీంతో ఉపాధి కల్పనాధికారులకు పని లేకుండా పోయింది. నెల, రెండు నెలలకు ఒకసారి ప్రైవేటు సంస్థల్లో చిన్నపాటి ఉద్యోగాల కోసం జాబ్‌మేళాలు నిర్వహించడమే ప్రధాన కర్తవ్యంగా ఉపాధి కార్యాలయాలు తయారయ్యాయి. దీని కోసం బాలికల ఐటీఐలో గల 12 గదులను అధీనంలో ఉంచుకోవడంతో నిరుపయోగంగా మారాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధి కార్యాలయం మేడపై నరవ ఐటీఐ నిర్వహణ

ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టు బాధిత ప్రాంతాల పిల్లలకు శిక్షణ ఇచ్చేందుకు అల్లూరి జిల్లా గరుగుబిల్లిలో పెట్టాల్సిన నరవ ఐటీఐని అక్కడ భవనాలు అందుబాటులోకి రాకపోవడంతో పదేళ్లుగా బాలికల ఐటీఐ ప్రాంగణంలోనే నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఉపాధి కార్యాలయం మేడపై ఉండే 12 గదులను నరవ ఐటీఐ వారు వినియోగిస్తున్నారు. నరవలో ఇప్పటికే భవన నిర్మాణ పనులు జరుగుతుండడంతో త్వరలో అక్కడకు ఐటీఐని మార్చి ఆ భవనాన్ని అప్పగించే అవకాశం ఉంది. ఉపాధి కార్యాలయాన్ని కూడా ఇక్కడ నుంచి తరలిస్తే బాలికల ఐటీఐకి పూర్తిస్థాయిలో మౌలిక వసతులు సమకూరుతాయని ఆశాభావం వ్యక్తమవుతోంది. నూతన ట్రేడులు రానున్న నేపథ్యంలో శిక్షణ పొందనున్న బాలికలకు కూడా ఉపయుక్తంగా ఉంటుందని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.

నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ హడావుడి

ఉపాధి కార్యాలయం, నరవ ఐటీఐతో పాటు బాలికల ఐటీఐని ఆనుకుని మూడేళ్ల క్రితం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ (ఎన్సీ/ఎస్టీ) ఏర్పాటు చేశారు. దీని వలన కూడా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో నిస్సారంగా తయారైందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పారిశ్రామిక శిక్షణ, ఉపాధి కల్పన శాఖల ఉన్నతాధికారులు ఆయా భవనాలపై దృష్టి సారించి ఖాళీ చేయిస్తే బాలికల ఐటీఐ ద్వారా కొన్ని వేల మందికి నాణ్యమైన శిక్షణ, మౌలిక వసతుల కల్పన సాధ్యమవుతుందని విద్యార్థినులు, ప్రజలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ టేబుల్ టెన్నిస్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా విశాఖ శాఖ నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14, 17, 19 బాలురు, బాలికల టేబుల్ టెన్నిస్ టోర్నీ శనివారం నుంచి జరగనుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. గోపాలపట్నంలోని ఇండోర్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్‌లో మూడు రోజులు జరగనున్న ఈ టోర్నీలో రాష్ట్ర వ్యాప్తంగా 390 మంది క్రీడాకారులు, 76 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ టోర్నీ ప్రారంభోత్సవానికి పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు గణబాబు అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు.

పీఎఫ్ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్సీకి ఏపీటీఎఫ్ వినతి


ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగ విరమణ పొందినవారి పీఎఫ్ సమస్యను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా ప్రతినిధులు ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావును కోరారు. ఆయనకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన ఆయన రాష్ట్ర ట్రెజరీ, సీఎఫ్ఎంఎస్ అధికారులతో చర్చించి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణ, దేముడుబాబు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

రాజ్యాంగ దినోత్సవంపై విద్యార్థులకు పోటీలు


మాట్లాడుతున్న ఎంఈవో రామారావు

అక్కయ్యపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో)-1 డి.రామారావు హాజరై రాజ్యాంగ దినోత్సవం గొప్పతనాన్ని వివరించారు. మండల స్థాయి విజేతలకు నియోజకవర్గం, జిల్లా స్థాయిలో తదుపరి పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 బాలామణి, ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి, డైట్ లెక్చరర్ సునీత, సీఆర్పీ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

మాధవధార, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించనున్నట్లు విశాఖ జిల్లా వైసీపీ అధ్యక్షుడు కె.కె.రాజు తెలిపారు. శుక్రవారం మురళీనగర్ ఎన్‌జీజీవోస్ కాలనీలోని ఓ ఫంక్షన్ హాలులో ప్రజా ఉద్యమం పేరిట పోస్టర్‌ను ఆవిష్కరించారు. అదే రోజున అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు ఉంటాయని తెలిపారు. వైసీపీ ముఖ్యనేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

14 నుంచి నరెడ్కో వైజాగ్ ప్రాపర్టీ ఫీస్ట్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు

మహారాణిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, స్థిరాస్తి రంగం వ్యాపారులు మరిన్ని పెట్టుబడులతో ముందుకు రావాలని విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్ పిలుపునిచ్చారు. నరెడ్కో అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబరు 14 నుంచి 16 వరకు బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహించనున్న నరెడ్కో వైజాగ్ ప్రాపర్టీ ఫీస్ట్-2025 బ్రోచర్‌ను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తదితరులతో కలిసి ఎంపీ శ్రీభరత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విశాఖ నగరానికి పెద్ద పెద్ద కంపెనీలు వస్తున్నాయని, పెద్ద ప్రాజెక్టులు రావాలంటే పెద్ద ఆలోచనలే చేయాలన్నారు. అభివృద్ధికి అనుగుణంగా అవకాశాలు అందిపుచ్చుకొనే ఆలోచనలతో ముందుకు అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధికి విశాఖలో అడుగులు పడుతూ ఉంటే ప్రతిపక్షాలు అడ్డుకునే విధంగా విమర్శలు చేస్తున్నాయని అన్నారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ విశాఖకు గూగుల్ సంస్థ రావటంతో పెద్ద సంఖ్యలో పెట్టుబడులు వస్తున్నాయని, నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశేష కృషి చేస్తున్నారని అన్నారు. వచ్చే మూడేళ్లలో విశాఖ రూపురేఖలు మారతాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి విశాఖ మీదుగా కోనసీమ వరకు రహదార్లు విస్తరిస్తున్నామని, వీఎంఆర్డీఏ పరిధిలో ఏడు మాస్టర్ ప్లాన్ రోడ్లు వేగంగా వేస్తున్నట్లు తెలిపారు. రూ.550 కోట్ల ఐఎఫ్‌సీ రుణానికి వెళ్తున్నట్లు తెలిపారు. విశాఖకు నిరంతరం నీరందించే, నీటిశుద్ధి ప్లాంట్‌లు వస్తున్నాయని వెల్లడించారు. ఈ సమావేశంలో నరెడ్కో నాయకులు పి.రాజశేఖర్, ఎ.రమేష్ బాబు, జి.చక్రధర్, రాహుల్ శండేనియా, వెంకన్న చౌదరి, పలువురు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యువజనోత్సవాలు


సెయింట్ జోసెఫ్ కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులతో డీఆర్ఎం లలిత్ బొహ్రా

జ్ఞానాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం యువజనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా జ్యోతి ప్రజ్వలన చేసి బెలూన్లు వదిలి ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు చక్కని శాస్త్రీయ, పాశ్చాత్య, జానపద నృత్యాలు, పాటలు, మూకాభినయంతో ఆహూతులను అలరించారు. నగరంలోని 60 కళాశాలల నుంచి దాదాపు 3 వేల మంది విద్యార్థులు ఈ వేడుకల్లో ఉల్లాసంగా పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ తెలిపారు. ఈ వేడుకల్లో పి.కె.జయలక్ష్మి, ఎక్స్‌ల్సియార్ కమిటీ ప్రతినిధులు డా.సుజాత, డా.మౌనమి, డా.కోటేశ్వరరావు, ప్రత్యూష, సిస్టర్ దీపాలి, వైస్ ప్రిన్సిపల్ హేమ, సిస్టర్ మేరీ, నాన్సీ పాల్గొన్నారు.

సర్వర్ సమస్యతో ఆధార్ అప్‌డేషన్‌లో ఇబ్బందులు


కంచరపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థుల ఆధార్ అప్‌డేషన్ కోసం చేపట్టిన మేండేటరీ బయోమెట్రిక్ అప్‌డేషన్ (ఎంబీయూ) ప్రక్రియ సర్వర్ సమస్యతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వేలిముద్రలను అప్‌డేట్ చేయడం కోసం నగరంలోని పలు పాఠశాలల్లో ఈ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గోపాలపట్టణం మండల పరిధిలో 12 పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో నమోదు ప్రక్రియ జరుగుతోంది. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు తగిన సమాచారంతో అప్‌డేషన్ చేయించుకోవడానికి పూర్తిస్థాయిలో హాజరవుతున్నారు. సర్వర్ డౌన్ కావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ అప్‌డేషన్‌ను గడువులోగా (అక్టోబరు 31) ముగించాల్సి ఉంది. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి సర్వర్ సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్టాండింగ్ కమిటీలో కమీషన్ లొల్లి

... 5వ పేజీ తరువాయి

చేతిలో పెడుతున్నాడని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రెండు రోజుల క్రితం (బుధవారం) జరిగిన స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాల్లో కొందరు కాంట్రాక్టర్ల నుంచి రూ.25 లక్షలు వసూలు చేశారని, అందులో ఆరు శాతం కింద సభ్యులకు రూ.14 లక్షలు కేటాయించి, 11 వాటాలు వేశారని. మిగిలిన రూ.11 లక్షలను నాలుగు శాతం కింద కీలక నేతకు ఇచ్చినట్టు చెబుతున్నారని స్టాండింగ్ కమిటీలోని ఒక సభ్యుడు ఆరోపించారు. అయితే వసూలైన మొత్తాన్ని 11 వాటాలు వేయాలని కొందరు సభ్యులు పట్టుబట్టినట్టు సమాచారం. తాజా పరిణామాల నేపథ్యంలో భవిష్యత్తులో స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో ఏం జరుగుతుందోననే చర్చ కార్పొరేటర్లలో చర్చ జరుగుతుండడం విశేషం.

అంధకారంలో కొండ ప్రాంతాలు


చీకటిగా ఉన్న సత్యసాయినగర్ ప్రాంతం

అక్కయ్యపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం పరిధిలోని 45వ వార్డు కొండవాలు ప్రాంతాలు వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారంలో ఉన్నాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండ ప్రాంతాలు సింహగిరి కాలనీ, సత్యసాయినగర్, గణేష్‌నగర్, వరహగిరి కాలనీ 1, 2, సింగాలమ్మపురం తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. కనీసం మరమ్మతులకు గురైన దీపాలు మార్చాలని కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల క్రితం నుంచి గణేష్‌నగర్ ప్రధాన జంక్షన్‌లో వీధి దీపాల సమస్య ఎక్కువైందని, వీటిని బాగు చేయాలని కోరినా పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన కూడలి కావడంతో వాహనచోదకులు, నడిచి వెళ్తున్న వృద్ధులు, మహిళలు అవస్థలు పడుతున్నారని పేర్కొంటున్నారు.

భద్రాద్రి రాముడ్ని దర్శించుకున్న ఎమ్మెల్యే


ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఆశీర్వచనం అందజేస్తున్న భద్రాచలం ఆలయ అర్చకులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారామచంద్రస్వామిని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం పలికారు. ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ రామయ్యను దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్వామివారి దయతో దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

ప్రజా నాట్యమండలి శిక్షణ తరగతులు ప్రారంభం


అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

కంచరపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బీఎస్ఆర్ భవనంలో రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాట్య మండలి నాయకులు పతాకాన్ని ఆవిష్కరించి ఇటీవల అమరులైనవారికి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు షేక్ వల్లీ, జిల్లా కార్యదర్శి ఎం.చంటి ఆధ్వర్యంలో జరిగిన శిక్షణలో వివిధ జిల్లాల నుంచి నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మతోన్మాద ప్రమాదం, నివారణ చర్యలపై చర్చించారు. మతోన్మాద నివారణకు, ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కార్యకర్తలు సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. జి.సన్యాసిరావు, అనిల్‌కుమార్, జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

లిక్విడ్ గంజాయి తరలింపు కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

మహారాణిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): లిక్విడ్ గంజాయిని తరలించిన కేసులో ప్రధాన నిందితుడ్ని పటుకున్నట్లు టూటౌన్ సీఐ దివాకర్ యాదవ్ తెలిపారు. ఆగస్టు లో లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను మహారాణిపేట పోలీసులు పట్టుకున్నారు. అందులో ప్రధాన నిందితుడైన గూడే దిలీప్ కుమార్ పోలీసులకు దొరక్కుండా గోవా తదితర ప్రాంతాల్లో ఉండిపోయాడు. ఈ క్రమంలో అతనిపై నిఘా ఉంచిన పోలీసులు దిలీప్ విశాఖకు రావటంతో పట్టుకున్నారు. నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకున్న సీఐ దివాకర్ యాదవ్, హెడ్ కానిస్టేబుల్ సురేష్, చంద్రశేఖర్, కానిస్టేబుల్ నాగేంద్రలను పోలీసు కమిషనర్ బాగ్చి, ఇతర అధికారులు అభినందించారు.

తప్పిపోయిన మహిళ భర్తకు అప్పగింత

డాబాగార్డెన్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన మహిళను ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి వాసు తెలిపారు. కిరణ్ (30) అనే మహిళ ఇద్దరు పిల్లలతో కలిసి గురువారం రాత్రి గురుద్వార్ జంక్షన్‌లో ఒంటరిగా తిరుగుతుండగా 4వ పట్టణ పోలీసులు అనుమానంతో టీఏస్సార్ మహిళా షెల్టర్‌కు తరలించారు. వెంటనే ఆమె భర్త సలీందర్‌కు ఫోన్ ద్వారా శుక్రవారం సమాచారం ఇవ్వడంతో ఆయన హుటాహుటిన వైజాగ్ వచ్చారని పేర్కొన్నారు. తన భార్య మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఇలా చేస్తుందని, నాసిక్ నుంచి హైదరాబాద్ వెళ్లే క్రమంలో వైజాగ్‌లో రైలు దిగిపోయిందని తెలిపారు. భార్య కిరణ్‌ను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పి ఆమెను భర్తకు అప్పగించామన్నారు.

నగరానికి చేరుకున్న న్యూజిలాండ్ మహిళా క్రికెటర్లు

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళల ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీలో భాగంగా ఈ నెల 26న ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఇంగ్లండ్‌తో తలపడనున్న న్యూజిలాండ్ జట్టు క్రికెటర్లు శుక్రవారం నగరానికి చేరుకున్నారు. నవీ ముంబాయి నుంచి చార్టెడ్ ఫ్లైట్‌లో సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుంచి ప్రత్యేక బస్సులో ద పార్కు హోటల్‌కు చేరుకున్నారు. కెప్టెన్ సోఫీ డివైన్‌తోపాటు సుజీ బేట్స్, జార్జియా ప్లిమ్మర్, అమేలియా, బ్రూక్ హాలిడే, మ్యాడీ గ్రీన్, ఇసాబెల్లా గేజ్, జెస్‌కెర్, రోజ్మేరి మైర్, లియా తహుహు, ఈడెన్ కార్సన్, బ్రీ ఇల్లింగ్, రోడ్‌పాలీ, బెల్లా జేమ్స్ చేరుకున్నారు. గురువారం నవీ ముంబాయిలో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో 53 పరుగుల తేడాతో ఓడిన న్యూజిలాండ్ ఇప్పటివరకు 6 మ్యాచ్‌లు ఆడి ఒక గెలుపు, మూడు ఓటమి, రెండు ఫలితం తేలని మ్యాచ్‌లో ఆరు పాయింట్లు సాధించింది. అయితే 23న భారత్‌పై ఓటమితో సెమీఫైనల్స్‌కు చేరే అవకాశాలు మూసుకుపోయాయి. దీంతో ఇప్పటికే ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, భారత్‌తోపాటు సెమీఫైనల్స్‌కు బెర్తు ఖరారు చేసుకున్న ఇంగ్లండ్‌కు ఆదివారం న్యూజిలాండ్‌తో జరగనున్న మ్యాచ్ నామమాత్రమే.

పలువురు సీఐల బదిలీ

... 5వ పేజీ తరువాయి

జి.అర్జున్‌ను సీ పోర్టు ఇమ్మిగ్రేషన్ అధికారిగా పంపారు. సీ పోర్టు ఇమ్మిగ్రేషన్ అధికారిగా ఉన్న వి.శ్రీనివాసరావును సిటీ వీఆర్‌కు అటాచ్ చేశారు. ఎయిర్‌పోర్టు ప్రొటోకాల్ అధికారిగా ఉన్న మలిరెడ్డి నాగేశ్వరరావును సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఎయిర్‌పోర్టు సీఐగా ఉన్న జి.ఉమామహేశ్వరరావును సిటీ వీఆర్‌కు అటాచ్ చేశారు. సీసీఎస్ సీఐగా ఉన్న వి.శంకర్‌నారాయణను ఎయిర్‌పోర్టు లా అండ్ ఆర్డర్ సీఐగా బదిలీ చేశారు. కొత్త బాధ్యతలు వెంటనే చేపట్టాలని కమిషనర్ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

రయ్..రయ్..

... 5వ పేజీ తరువాయి

హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళుతున్నాయి. అందుకని అధికారులు ఎన్ఏడీ, కూర్మన్నపాలెం జంక్షన్లలో ఎక్కువగా తనిఖీలు చేపట్టారు. అలాగే అనకాపల్లి వద్ద కూడా తనిఖీలు నిర్వహించారు. అత్యధిక శాతం బస్సుల్లో ఫైర్ ఎక్స్టింగ్విషర్లు కండిషన్‌లో లేవని గుర్తించి కేసులు నమోదు చేశారు. తమిళనాడులో రిజిస్టర్ అయిన బస్సు పర్మిట్ గడువు ముగిసినా తిప్పుతున్నట్టు గుర్తించి శుక్రవారం రాత్రి రూ.2,03,00 జరిమానా వేశారు. బీమా పత్రాలు చూపించకపోవడంతో మరో రెండు బస్సులపై కేసులు పెట్టారు. ఎమర్జెన్సీ ఎగ్జిట్ సరిగ్గా లేదని రూ.21,200 జరిమానా వేశారు.

పర్మిట్ లేకుండా వస్తే కేసులు తప్పవు

సరైన పర్మిట్లు, అనుమతులు లేకుండా ట్రావెల్స్ బస్సులను రోడ్లపైకి తీసుకువస్తే దానికి యజమానులే బాధ్యులు. ఈ నెల 13వ తేదీ నుంచి తనిఖీలు నిర్వహించి ఇప్పటివరకూ 58 కేసులు నమోదు చేశాం. నాలుగు సీజ్ చేశాం. మొత్తం రూ.9,58,480 జరిమానా వసూలు చేశాం.

- ఆర్.శ్రీనివాసరావు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్

గూగుల్ రాకతో రియల్టర్ల హడావిడి

... 5వ పేజీ తరువాయి

1,000 ఎకరాల వరకూ తీసుకుంది. పేదల ఇళ్లు, వీఎంఆర్డీఏ ఎంఐజీ లేఅవుట్‌లకు సమీకరించిన భూములకుగాను ఎకరాకు అభివృద్ధి చేసిన 900 గజాలు, 450 గజాల ప్లాట్లు ఇచ్చారు. ఆ ప్లాట్లు ఒకేచోట ఇవ్వడంతో ఇప్పుడు వాటిపై రియల్టర్ల కన్ను పడింది. గంపగుత్తగా కొనుగోలు చేసి భవిష్యత్తులో వెంచర్లు వేసుకోవాలని భావిస్తున్నారు. అలాగే ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్న కొందరు నేతల బంధువులు కూడా విశాఖలో భూముల గురించి ఆరా తీస్తున్నారు. ఒక కీలక నేత కుమారుడు రెండు రోజులుగా విశాఖలోనే మకాం వేసి ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల్లో భూములు కొనుగోలుకు తెలిసిన బ్రోకర్ల ద్వారా మంతనాలు చేస్తున్నారు. మరో కీలక నేత బంధువులు విశాఖ నగరానికి సమీపంలో గల గ్రామాల్లో భూములు వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. డేటా సెంటర్ రాకతో తమ మండలంలో భూములకు డిమాండ్ పెరిగిందని ఆనందపురానికి చెందిన టీడీపీ నేత ఒకరు వ్యాఖ్యానించారు. భూముల కోసం వారం రోజులుగా వ్యాపారులు వస్తున్నారని గిడిజాలకు చెందిన రైతులు పేర్కొన్నారు.

పీఎంఏవై 2.0లో 3,400 ఇళ్లు

... 5వ పేజీ తరువాయి

నడుపూరు, దువ్వాడ, అగనంపూడి, దేశపాత్రునిపాలెం, ముదపాక, జెర్రిపోతులపాలెం తదితర లేఅవుట్‌లకు నీటి సరఫరా కోసం రూ.139.32 కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మిగిలిన కాలనీలకు జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.472.7 కోట్లు అవసరమని ప్రతిపాదనల్లో పేర్కొన్నామన్నారు. అనకాపల్లి, గాజువాక, పెందుర్తి, విశాఖ పశ్చిమ నియోజకవర్గాల్లో ఉన్న కాలనీలకు పోలవరం కాలువ నుంచి, భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఇళ్లకు గోస్తనీ నది నుంచి నీటి సరఫరా జరుగుతుందన్నారు. విద్యుత్ సరఫరా కోసం ఈపీడీసీఎల్ అధికారులు కాలనీల వారీగా సర్వేలు చేసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారన్నారు. రోడ్లు, డ్రైన్ల కోసం ప్రతిపాదనలు రూపొందించాలని నిర్ణయించామన్నారు. తక్కువ ఖర్చుతో మ్యాజిక్ డ్రైన్లు నిర్మించేలా గ్రామీణ నీటి సరఫరా విభాగం ప్రతిపాదిస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టే కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. అగనంపూడి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో బినామీలపై సర్వే పూర్తిచేశామన్నారు. బినామీలు ఉన్న ఇళ్లకు నోటీసులు ఇచ్చామని, ఖాళీగా ఉన్న ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామని సత్తిబాబు అన్నారు.

కిడ్నీ రోగులకు ఊరట

... 5వ పేజీ తరువాయి

రోగుల సేవలకు వినియోగిస్తామని ఆస్పత్రి అధికారులు తెలిపారు. దీంతో డయాలసిస్ రోగులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

ప్రస్తుతం మూడు మెషీన్లతోనే...

గతంలో నెఫ్రాలజీ విభాగంలో మొత్తం పది మెషీన్లతో ప్రతిరోజూ 20 నుంచి 30 మంది కిడ్నీ బాధితులకు డయాలసిస్ చేసేవారు. మూడు నెలలుగా ఏడు మెషీన్లు పనిచేయకపోవడంతో కేవలం మూడింటితోనే నెట్టుకొస్తున్నారు. రోగులకు ఇబ్బంది లేకుండా పీపీపీ విధానంలో ఆస్పత్రి ఆవరణలో నిర్వహిస్తున్న నెఫ్రోప్లస్ సెంటర్‌లో కొంతమందికి డయాలసిస్ సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ప్రతిరోజూ 50 నుంచి 70 మంది రోగులకు నెఫ్రోప్లస్, నెఫ్రాలజీ విభాగంలో డయాలసిస్ చేస్తున్నారు. తాజాగా కొత్త మెషీన్లు అందుబాటులోకి రానుండడంతో రోగుల ఇబ్బందులకు తెరపడుతుందని చెబుతున్నారు. ఇన్‌స్టాలేషన్ పూర్తయిన తరువాత ప్రతిరోజూ నెఫ్రాలజీ విభాగంలోనే 40 నుంచి 50 మంది రోగులకు సేవలందిస్తామంటున్నారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ ప్రత్యేక చొరవతో మెషీన్లు వేగంగా అందుబాటులోకి వచ్చాయని ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ తెలిపారు.

జేఎన్ఆర్‌కు హౌసింగ్ చెక్

... 5వ పేజీ తరువాయి

నిర్మించే ఇళ్ల నాణ్యత పరిశీలించిన అనంతరం బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు అవకాశం ఇస్తారు. ప్రధానంగా మూడో ఆప్షన్ కింద లబ్ధిదారుల తరపున కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న ఇళ్ల నాణ్యత పరిశీలించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 65 లేఅవుట్‌లలో పలు దశల్లో నిర్మిస్తున్న ఇళ్ల నాణ్యతను పరిశీలించే పనిలో అధికారులు ఉన్నారు. జిల్లాలో మొత్తం లక్ష ఇళ్లలో సుమారు 35 వేలు జేఎన్ఆర్ కంపెనీయే నిర్మిస్తోంది. వైసీపీ నేతకు చెందిన కంపెనీ కావడంతో జగన్ ప్రభుత్వంలో అనేక జిల్లాల్లో వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణ బాధ్యతలు దక్కించుకుంది. విశాఖ జిల్లాలో పెద్ద లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న జేఎన్ఆర్ కంపెనీకి హౌసింగ్‌లో కొందరు అధికారులు వత్తాసు పలుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇద్దరు, ముగ్గురు ఏఈలు కూడా ఈ కంపెనీకి అనుకూలంగా ఉంటున్నారనేది బహిరంగ రహస్యం. అయితే ఇప్పుడు నెల్లూరుకు చెందిన ఎమ్మెల్యే ఆరోపణల నేపథ్యంలో అన్ని జిల్లాల్లో ఆ కంపెనీకి చెందిన ఇళ్ల నిర్మాణంపై విచారణ పూర్తయిన తరువాతే బిల్లులపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కాగా జిల్లాలో ఇతర నిర్మాణ సంస్థలు నిర్మించిన సుమారు 5,500 ఇళ్లకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్‌కు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. గురువారం వరకూ 4,100 ఇళ్ల నాణ్యతను పరిశీలించి వాటి ఫొటోలు, దశల వారీగా చెల్లించే బిల్లుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ ఇళ్లకు సుమారు రూ.10 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకూ తనిఖీ చేసిన ఇళ్లలో ఒకటి, రెండు శాతం మినహా మిగిలిన నాణ్యత బాగానే ఉందని హౌసింగ్ పీడీ సీహెచ్ సత్తిబాబు పేర్కొన్నారు. పైడివాడ అగ్రహారంతోపాటు పలుచోట్ల ఇళ్లకు తలుపులు బిగించలేదని గుర్తించామన్నారు. లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించే సమయంలో తలుపులు బిగించి ఇవ్వాలని నిర్మాణ సంస్థలకు స్పష్టం చేశామన్నారు.



అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

నిత్యాన్నదానం ప్రారంభం

వేపగుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్‌లోని దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్ప భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 41 రోజుల పాటు ఈ కార్యక్రమన్ని కొనసాగిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు, స్థానికులు పాల్గొన్నారు.

అబాకాస్ పోటీలు రేపు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్లాంటులోని స్టీల్‌క్లబ్ ఆడిటోరియంలో ఆదివారం అబాకస్ పోటీలను నిర్వహించనున్నామని మేథ్‌టూమెరిట్ సంస్థ ఎండీ ఈ.సుధారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచేందుకు అబాకస్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

మెగా వైద్య శిబిరం రేపు

అగనంపూడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రి సహకారంతో ఆదివారం నడక మైదానం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు మడగల నరసింగరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దుర్గమాంబకు ప్రత్యేక పూజలు

అగనంపూడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహకులు అమ్మవారిని ప్రత్యేక వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్రా గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి'

గాజువాక, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.జగ్గునాయుడు అన్నారు. పాతగాజువాక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులకు నేటి ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని ఆరోపించారు. త్వరలో నగరంలో నిర్వహించనున్న అఖిలభారత సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజి** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 17, టమాటా 34, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 26, క్యారెట్ 66, దొండకాయలు 42, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 78, అల్లం (పాతది) 70, బరబాటి 40, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 20, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 48, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికా య 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

ప్రయాణమంటేనే భయం.. భయం!

- పారిశ్రామిక ప్రాంతంలో ఇటీవల పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- బెంబేలెత్తుతున్న వాహనదారులు



గాజువాకలో జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

గాజువాక, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో రోజురోజుకీ రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. దీంతో రోడ్డుపై ప్రయాణించాలంటే జనం భయంతో వణికిపోతున్నారు. రెండు నెలల వ్యవధిలో సుమారు పదిహేను మంది మృత్యువాత పడతంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. జాతీయ రహదారితో పాటు ప్రధాన మార్గాల్లో భారీ వాహనాల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గాజువాక పరిశ్రమలకు కేంద్రం కావడంతో భారీ వాహనాల నిత్యం రాకపోకలు సాగిస్తాయి. దీంతో ప్రమాలు నిత్యకృత్యమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి పాతగాజువాక జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. గతంలో పోర్టు రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఓ యువ జంట, పంతులుగారి మేడ వద్ద ఓ యువకుడు, ఇటీవల జగ్గు జంక్షన్ వద్ద హిందూజా ఉద్యోగి, స్టీల్‌సీటీ ఆర్టీసీ డిపో ఎదురుగా లారీ ఢీకొనడంతో ఇద్దరు స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు, జగ్గు జంక్షన్ వద్ద ఓ వ్యక్తి, టోల్ గేటు సిగ్నల్ వద్ద యువకుడు, సుందరయ్యకాలనీ వద్ద ఓ వ్యక్తి మృతిచెందారు. దీంతో వాహనదారులు బీతిల్లుతున్నారు.

విస్తరణకు నోచని రహదారులు

ఇక్కడ వందల సంఖ్యలో పరిశ్రమలు ఉండడంతో గాజువాక కేంద్రంగా రాకపోకలు సాగుతున్నాయి. నిత్యం వాహనాలతో రోడ్లు నిండిపోతున్నాయి. అందుకు అనుగుణంగా రహదారులు విస్తరణకు నోచుకోకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు పాటించాలి



పారిశ్రామిక ప్రాంతంలో భారీ వాహనాల తాకిడి ఎక్కువ. కీలక జంక్షన్‌లలో ప్రమాదాలు జరగకుండా నిత్యం సిబ్బందితో చర్యలు చేపడుతున్నాం. రద్దీ ప్రాంతాల్లో మరింత నిఘా ఉంచుతున్నాం. వాహనదారులు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

- హుస్సేన్, ట్రాఫిక్ సీఐ, గాజువాక

తీరనున్న టిడ్కో లబ్ధిదారుల కల

- ఎమ్మెల్యే చొరవతో జోరుగా సాగుతున్న మౌలిక సదుపాయాల పనులు



మల్కాపురం శివారులో నిర్మించిన టిడ్కో ఇళ్లు

మల్కాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం శివారు కొండల మధ్య రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు జోరుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అచ్చినాయుడు తోటకు సంబంధించి అనేక సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించడంలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. 2014లోనే అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇక్కడ టిడ్కో ఇళ్లను నిర్మించింది. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇక్కడ నిర్మాణ పనులు కుంటు పడ్డాయి. మళ్లీ 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయాయి. ఈ నేపథ్యంలో గాజువాక కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి అచ్చినాయుడు తోటలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు మంచినీటి సరఫరా చేసేందుకు పైప్‌లైన్ పనులను మొదలు పెట్టారు. అయితే ఈ పనులు కొంత కాలానికి ఆగిపోయాయి. ఈ తరుణంలో ఎమ్మెల్యే గణబాబు చొరవతో తిరిగి ఆ పనులు మొదలయ్యాయి. ఈ పైప్‌లైన్ పనులు పూర్తయితే టిడ్కో ఇళ్లకు మంచినీటి సమస్య పరిష్కారమవుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికే రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి ప్రణాళికలు కూడా సిద్ధం చేశారు. ఈ రెండు పనుల పూర్తయితే టిడ్కోలకు సంబంధించి అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లేనని పలువురు లబ్ధిదారులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఇళ్లకు ఇంటీరియర్ పనులను సదరు కాంట్రాక్టర్ ప్రస్తుతం నిలిపివేశారని తెలిసింది. ప్రభుత్వం నుంచి ఈ కాంట్రాక్టర్‌కు దాదాపు రూ.15 కోట్లు బకాయిలు రావాల్సి ఉందని, వాటిని చెల్లించాక మిగిలిన పనులను మొదలు పెట్టే యోచనలో ఉన్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే గణబాబు సదరు కాంట్రాక్టర్‌తో ఇళ్ల పనుల గురించి చర్చలు జరిపినట్టు తెలిసింది.

సిమెంటు గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు చేయొద్దు



తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడకు అతి సమీపంలో అదానీ అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వొద్దని దయాళ్‌నగర్ రెసిడెంట్స్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తహశీల్దార్ అమలకు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ప్రాంతంలో గంగవరం పోర్టు, పారిశ్రామికవాడ, డంపింగ్ యార్డు, భారీ వాహనాల పార్కింగ్ యార్డు ఏర్పాటు చేయడం వల్ల కాలుష్యం మరింత పెరుగుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇక్కడ సిమెంటు గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే వృద్ధులకు, పిల్లలకు, గర్భిణులకు శ్వాసకోశ, కిడ్నీ వ్యాధులు, ఇతర చర్మరోగాలు ప్రబలే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల సిమెంట్ యూనిట్ ఏర్పాటుకు త్వరలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. త్రినాధరావు, ప్రధాన కార్యదర్శి ఎస్‌వై నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెండోసారి ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలి

మల్కాపురం: పెదగంట్యాడలో సిమెంట్ గ్రైండిగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని సిమెంట్ వ్యతిరేక కమిటీ శ్రీహరిపురం వాకింగ్ పార్కు వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు కె.నూకరాజు, బి.తాతాజీ. ఆర్.దేవరాజు, సుధాకర్ మాట్లాడుతూ అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టొదని ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నా రెండోసారి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని పెట్టాలనే ఆలోచన రావడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పెదగంట్యాడలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే శ్రీహరిపురం, మల్కాపురం, సిందియా గ్రామాలపై కాలుష్య ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ విషయంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు చొరవ తీసుకుని ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు, సీఐటీయూ మల్కాపురం జోన్ సభ్యులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గౌరీపరమేశ్వరులు

అగనంపూడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు అట్టవానిపాలెంలో ప్రతిష్ఠించిన గౌరీపరమేశ్వరులకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరీపరమేశ్వరులను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. బొర్రమాంబ పారాయణ సమితి ఆధ్వర్యంలో లలితా, విష్ణు సహస్ర నామ పారాయణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గౌరీపరమేశ్వరుల అనుపోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్టు నిర్వహకులు తెలిపారు. ఉత్సవాల ముంగింపు సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా సారె ఊరేగింపు

అక్కిరెడ్డిపాలెం, (ఆంధ్రజ్యోతి) : హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో నిర్వహిస్తున్న గౌరీపరమేశ్వరుల ఉత్సవంలో భాగంగా శుక్రవారం సారే ఊరేగింపు, దీపార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల మిఠాయిలతో పాటు వివిధ రకాల పండ్లు, పూలను పళ్లెంలో అమర్చి ఊరేగింపుగా తీసుకువెళ్లి గౌరీపరమేశ్వరులకు నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ వేదిక వద్ద మహిళలు దీపార్చన నిర్వహించారు.

లభ్యం కాని యువకుల ఆచూకీ

మల్కాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యారాడ సముద్రంలో గల్లంతైన ఇద్దరి యువకుల ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. గల్లంతై ఐదు రోజులు గడుస్తున్న నేపథ్యంలో వారి కోసం వెతికే కార్యక్రమానికి పోలీసులు ఫుల్‌స్టాప్ పెట్టారు. పోలీసులు నాటి నుంచి నేటి వరకు 12 మంది గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపడుతూనే ఉన్నారు. వారు మునిగిపోయి 5 రోజులు గడుస్తుండడంతో పోలీసులు, బంధువులు ఆ యువకుల ఆచూకి ఇక లభ్యం కానట్టే అనే నిర్ధారణకు వచ్చారు. హిందూ సంప్రదాయ ప్రకారం ఖర్మకాండలకు బంధువులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ నెల 19న 15 మంది మిత్రులతో కలిసి పవన్, గణేశ్ అనే యువకులు యారాడ సముద్రానికి స్నానానికి వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే.

సుడి దోమ పోటుపై అవగాహన తప్పనిసరి

- వ్యవసాయాధికారి చంద్రావతి

పెందుర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరపల్లి, రాంపురంలో కోత దశలో ఉన్న వరి పంటలు దోమపోటుకు గురై ఎండిపోతున్న క్రమంలో వ్యవసాయాధికారులు శుక్రవారం నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి చంద్రావతి ఆధ్వర్యంలో ఏడీఏ మాణిక్యం పర్యవేక్షణలో అనకాపల్లి జిల్లా వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు ఉమామహేశ్వరరావు, సరిత బృందం పంటలను పరిశీలన చేశారు. వరికి సుడి దోమ పోటు ఉన్నట్టు గుర్తించారు. ఆ దోమల వల్ల కలిగే పంట నష్టాన్ని నియంత్రించడానికి సస్య రక్షణ పద్ధతులు మందుల వినియోగాన్ని రైతులకు వివరించారు. దోమ పోటు నివారణకు ఎకరాకు ఎసిఫేట్ 300 గ్రాముల మందును 20 లీటర్ల నీటిలో కలిపి వరి దుబ్బు మొత్తం తడిచే విధంగా పిచికారి చేయాలని సూచించారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గోపాలపట్నం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రొమ్ము క్యాన్సర్ నివారణపై జడ్పీ బాలికోన్నత పాఠశాలలో హోమీబాబా క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్య బృందం రొమ్ముకేన్సర్‌ను ఎలా గుర్తించాలి, ఎటువంటి చికిత్స చేయించుకోవడం ద్వారా ప్రమాదం నుంచి బయటపడవచ్చనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జన్యుపరంగా క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ వయస్సుతో సంబంధం లేకుండా సక్రమిస్తాయని, వీటిని సకాలంలో గుర్తించి పూర్తిస్థాయిలో జయించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం స్వర్ణలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

పెందుర్తిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగాడి గ్రామంలో ఉన్న స్ఫటిక శివలింగేశ్వర సమేత స్వర్ణాకర్షణ కాలభైరవ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలభైరవ ఉపాసకుడు విశ్వసాయి గురూజీ సంకల్పంతో బ్రహ్మశ్రీ దార్లపూడి సంతోశ్‌శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు రుద్ర త్రిశూల, నాగ (రాహువు, కేతువు) దత్తాత్రేయ పాదుకా ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, కార్పొరేటర్ ముమ్మన దేముడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలి

- టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన సమావేంలో ఆయన మాట్లాడుతూ ప్లాంటు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. నిర్వాసిత కార్మికులను తొలగించడం సరికాదని, ఉక్కు యాజమాన్యం నిర్వాసితులు చిన్న చూపు చూస్తోందని ఆరోపించారు. నిర్వాసితులకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు.

నాతయ్యపాలెంలో అభివృద్ధి పనుల పరిశీలన

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నాతయ్యపాలెం కాలనీల చేపట్టిన అభివృద్ధి పనులను కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో నిర్మిస్తున్న రహదారులు, కాలువ పనుల్లో ఎక్కడా నాణ్యత తగ్గకుండా ఉండాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలు వినియోగించుకునేలా చూడాలని కాంట్రాక్టర్‌ను, జీవీఎంసీ సిబ్బందిని కోరారు. ఈ పర్యటనలో పలువురు కాలనీ నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత మైటీ డిమోన్స్ జట్టు

పెదగంట్యాడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అయ్యన్నపాలెం కృష్ణాయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ క్రీడా మైదానంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ శుక్రవారం జరిగింది. ఈ సంరద్భంగా పోటీలో పాల్గొన్న జట్లలో మైటీ డిమోన్స్ జట్టు ప్రధమ స్థానంలో నిలిచింది. లెగసీస్టార్స్ ద్వితీయ స్థానం, వారియర్స్ జట్టు తృతీయ స్థానం, వైజాగ్‌స్టీల్స్ నాలుగోస్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో మొదటి స్థానం సాధించిన జట్టుకు రూ.50 వేలు, రెండో స్థానం సాధించిన జట్టుకు రూ.30 వేలు, మూడో స్థానం సాధించిన జట్టుకు 20 వేలు, నాలుగో స్థానం సాధించిన జట్టుకు రూ.10 వేలు అందించారు. టీడీపీ సీనియర్ నాయకులు పులి వెంకటరమణారెడ్డి, పల్లా కార్తిక్, కాతా బాలకృష్ణ తదితరులు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు తోపుడు బండ్ల పంపిణీ

పెందుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 97 వార్డు చిన ముషిడివాడలో పరిశుధ్య కార్మికులకు తోపుడు బండ్లను కార్పొరేటర్ సేనాపతి వసంతశంకర్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు.



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, విశాఖ పోస్ట్‌మాస్టర్ జనరల్ వీఎస్ రవిశంకర్, తపాల శాఖ సీనియర్ సూపరింటెండెంట్ గజేంద్రకుమార్

అంకితభావంతో విధులు నిర్వహించాలి

- రోజ్‌గార్ మేళాలో ఎంపీ శ్రీభరత్
- 100 మందికి ఉద్యోగ నియామక పత్రాల అందజేత

డాబాగార్డెన్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగం పొందిన వారు సర్వీస్ కాలంలో అంకితభావంతో పని చేయాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. శుక్రవారం సిరిపురం వీఎంఆర్డీఏ థియేటర్‌లో తపాలశాఖ ఆధ్వర్యంలో రోజ్‌గార్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో 50 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేయడం విశేషమన్నారు. వేలాది మందికి ఉద్యోగం నియామక పత్రాలు కల్పించినందుకు ప్రధానమంత్రి మోదీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. విశాఖలో పోస్టల్, కస్టమ్స్, రైల్వే, నేవీలలో సుమారు 100 మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు.

కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు మేళాను ఉద్దేశించి ఢిల్లీ నుంచి తన సందేశం అందించారు. యువత సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం నిబద్ధతతో నిర్వహిస్తున్న రోజ్‌గార్ మేళా మంచి అవకాశం అన్నారు. ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు డబుల్ ఇంజన్ నాయకత్వంలో భద్రతతో కూడిన భవిష్యత్తును కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ పోస్ట్‌మాస్టర్ జనరల్ వీఎస్ రవిశంకర్, తపాల శాఖ సీనియర్ సూపరింటెండెంట్ గజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోల్‌బాల్ క్రీడాకారులకు జెర్సీల పంపిణీ



రోల్‌బాల్ క్రీడాకారులతో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి రోల్‌బాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు జెర్సీలను అందజేశారు. శనివారం నుంచి ఆగ్రాలో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ రోల్‌బాల్ నేషనల్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు గణబాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రీడలపై ఆశక్తి ఉన్న విద్యార్థులను తల్లిదండ్రులు పోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు జెర్సీలను అందజేసి గణబాబు అభినందించారు. కార్యక్రమంలో రోల్‌బాల్ అసోసియేషన్ సభ్యులు అనిల్‌రెడ్డి, తోట లలిత ప్రియ, కోచ్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా తెలుగుదేశం

- పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా టీడీపీ నిలుస్తోందని గాజువాక ఏపీఐఐసీ డైరెక్టర్, టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరుగా తెలుగుదేశం పార్టీ నిలుస్తోందని, ప్రజల సంక్షేమమే పార్టీ లక్ష్యమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసే విధంగా కార్యకర్తలు ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

2న స్టీల్‌క్లబ్‌లో రాష్ట్ర స్థాయి పాటల పోటీలు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్లాంటులోని స్టీల్‌క్లబ్‌లో వచ్చే నెల 2వ తేదీన రాష్ట్ర స్థాయి పాటల పోటీల నిర్వహించనున్నామని స్టీల్‌క్లబ్ అధ్యక్షుడు, స్టీల్‌ప్లాంట్ జీఎం ఎం.మధుసూధన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్ర స్థాయిలో పాటల పోటీలను నిర్వహించనున్నామని తెలపారు. ప్రథమ స్థానానికి బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయా, తృతియా స్థానాలకు కన్సోలేషన్ బహుమతులు అందజేయనున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 31వ తేదీ లోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, ప్రతినిధులు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి కృషి: కార్పొరేటర్ బొమ్మిడి రమణ

ఎన్ఏడీ జంక్షన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వార్డులోని రహదార్ల నిర్మాణానికి కృషి చేస్తానని కార్పొరేటర్ బొమ్మిడిరమణ పేర్కొన్నారు. వార్డు పరిధి కాకానీ నగర్‌లో రూ.17.5 లక్షల కార్పొరేషన్ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పి.గణబాబు సహకారంతో వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి బాబీ, వర్క్సు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ లలిత, కాలనీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్

కూర్మన్నపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు సోకకుండా అప్రమత్తం గా ఉండాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేటర్ బొండా జగన్ పేర్కొన్నారు. 87వ వార్డు అప్పికొండలో శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, తదితర సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా వారానికి ఒకసారి డ్రైడే పాటించాలని అన్నారు. 'పాలథిన్ వినియోగం వద్దు- నార సంచులు ముద్దు' తదితర అంశాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ శానిటరీ, మలేరియా విభాగాల సభ్యులు, సచివాలయం సిబ్బంది, వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

మల్కాపురం, (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులను నివారించ వచ్చని జోన్5 కమిషనర్ బి.రాము, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్ అన్నారు. మల్కాపురం ఏరియా విభాగం వార్డులోని డ్రైడే-ఫ్రైడే కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతే ఆరోగ్యా నికి భద్రత అనే విషయాన్ని గుర్తించాలని పే ర్కొన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దో మల వృద్ధిని అరికట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా విభాగం సూపర్‌వైజర్ సూర్యనారాయణ, శానిటరీ ఇన్ స్పెక్టర్లు ఉరుకూటి సతీశ్ యాదవ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాంపురంలో ఉపాధి గ్రామసభ

పెందుర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం గ్రామంలో ఉపాధి పథకం నిధులతో చేపట్టనున్న గ్రామీణాభివృద్ధి పనులు గుర్తింపు ప్రణాళికపై ఎన్ఆర్‌జీఈఎస్ సిబ్బంది శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రెడ్డి నారాయణరావు మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధికి ఉపాధి పథకం ఊతం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

విశ్రాంత జీవితం సాఫీగా సాగాలి



ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న డాక్‌యార్డు విశ్రాంత ఉద్యోగులు

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత జీవితం సాఫీగా సాగేలా ప్రణాళికలు వేసుకోవాలని ఐఐఎం డీన్, కార్యదర్శి డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర సూచించారు. నేవల్ డాక్‌యార్డ్ విశ్రాంత ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములకు ఎంవీపీ కాలనీలోని ఇంటిగ్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజిమెంట్ (ఐఏఎం) బిజినెస్ స్కూల్‌లో శుక్రవారం ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఉద్యోగ విరమణ అనంతరం జీవితంలో వ్యక్తిగత అభివృద్ధి, జీవితాంతం నేర్చుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణారావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన దినచర్య, సానుకూల అలవాట్లు, కుటుంబ సమైక్యతకు జీవిత భాగస్వాములతో సహకారంపై వివరించారు. రీడ్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ విశ్రాంత జీవనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. సమన్వయకర్తలు డాక్టర్ ఉమా సుందరి, డాక్టర్ బి.కృష్ణకుమారి పాల్గొన్నారు.

సిరిపురం సర్కిల్‌కు సరికొత్త శోభ

- రూ.19.7లక్షలతో సాగుతున్న పనులు
- పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి
- నగరవాసులు సేద తీరేందుకు అదనపు ఆకర్షణలు

సిరిపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సిరిపురం సర్కిల్ సరికొత్త శోభను సంతరించుకుంటోంది. ఈ ప్రాంతంలో వీఎంఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంతో పాటు పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన కూడళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ద్రోణంరాజు సర్కిల్ ఆధునికీకరణకు రూ.19.7 లక్షలు మంజూరు చేసింది. ప్రస్తుతం ఇక్కడ పనులు జోరుగా సాగుతున్నాయి. నగర వాసులతో పాటు పర్యాటకులను ఆకట్టుకునేలా ఈ సర్కిల్‌ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

ద్రోణంరాజు సర్కిల్‌లో ప్రస్తుతం ఉన్న వాటర్ ఫౌంటెన్‌కు అదనంగా మరో ఫౌంటెన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఉన్న చోటనే విస్తరించి, అందులో తామరపువ్వు ఆకారంలో ఫౌంటెన్‌ను చూడగానే ఆకట్టుకునేలా తీర్చిదిద్దనున్నారు. సర్కిల్ చుట్టూ ఉన్న గోడ ఎత్తు పెంచి, దానిని అందంగా మలిచే పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం గ్లోబు ఆకృతిలో ఉన్న వాటర్ ఫౌంటెన్‌కు సరి కొత్త రంగులతో శోభాయమానంగా తీర్చిదిద్దనున్నారు.



సర్కిల్‌లో ప్రస్తుతం ఉన్న వాటర్ ఫౌంటెన్



ఆధునికీకరిస్తున్న వాటర్ ఫౌంటెన్



చిల్డ్రన్ థియేటర్ ఎదురుగా సాగుతున్న పనులు

ప్రధాన సర్కిళ్ల ఆధునికీకరణ

నగరంలో సిరిపురం సెంటర్‌కు ప్రత్యేకత ఉంది. ఓ వైపు ఆంధ్ర విశ్వవిద్యాలయం, అదే దారిలో వీఎంఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం, చిల్డ్రన్స్ ఎరీనా, మరో వైపు సాఫ్ట్‌వేర్ కంపెనీలు, వాల్తేరు క్లబ్, సర్క్యూట్‌హౌస్ ఉండడంతో ఈ సెంటర్‌కు నిత్యం వీఐపీల తాకిడి అధికం. నిత్యం ప్రజల రాకపోకలతో రద్దీని సంతరించుకుంటుంది. కాగా ఈ సర్కిల్ అభివృద్ధికి గత పాలక మండలి ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదు. ప్రస్తుత పాలకమండలి రహదారులను సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు, ప్రధాన కూడళ్ల ఆధునికీకరణకు రంగం సిద్ధం చేసింది. సర్కిళ్లను ఆహ్లాదకరంగా మారుస్తున్నారు. నగర వాసులు, పర్యాటకులు సేదతీరేలా పనులు చేపడుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సకాలంలో పనులు పూర్తిచేసేలా శ్రద్ధ తీసుకుంటున్నామని జీవీఎంసీ ఏఈ చైతన్య దేవి తెలిపారు.



క్రైం... crime news

కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మణమూర్తి

సీతంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కిడ్నాప్ కేసులో పరారైన నిందితుడ్ని ఐదేళ్ల తరువాత నాలుగో పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఏసీపీ లక్ష్మణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. డాబాగార్డెన్స్‌కి చెందిన జామి సురేష్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. ఇతడికి చినముషిడివాడకి చెందిన ప్రతాప్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో అతడికి తెలిసిన గుంటూరుకు చెందిన పల్లపు ప్రసాద్ వద్ద రైస్ పుల్లింగ్‌కి చెందిన నాణేలు ఉన్నాయని పరిచయం చేశాడు. వీరిద్దరూ సురేష్ వద్ద డబ్బు కాజేయాలని పథకం వేశారు. హైదరాబాద్‌కి చెందిన ఎండీ లాయక్, బోయిన విష్ణుతో మాట్లాడి సురేష్ తన స్నేహితుడు శర్మతో కలిసి ఆశీల్‌మెట్ట వద్ద మద్యం సేవిస్తుండగా పథకం ప్రకారం తుపాకీ, కత్తులతో బెదిరించి కారులో ఎక్కించారు. పల్లపు ప్రసాద్ స్నేహితుడు సత్యప్రసాద్‌కు పరవాడలో ఉన్న గెస్ట్‌హౌస్‌కు తీసుకువెళ్లారు. రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే చంపేస్తామని భయపెట్టడంతో సురేష్ భార్యకు ఫోను చేసి బంగారం తాకట్టు పెట్టి డబ్బులు డ్రా చేయమని చెప్పాడు. సురేష్ భార్య, కుమారుడు బంగారు ఆభరణాలు పట్టుకొని సీతంపేటలోని ఐఐఎఫ్ఎల్ వద్దకు వచ్చారు. విషయాన్ని సురేష్ కుమారుడు డయల్ 100కి ఫోను చేసి తెలిపాడు. అక్కడికి చేరుకున్న పోలీసులను చూసి ప్రతాప్‌రెడ్డి, పల్లపు ప్రసాద్ పారిపోయారు. సురేష్ ఫిర్యాదు మేరకు 2020 జూలై 5న వారిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రతాప్‌రెడ్డి, పల్లపు ప్రసాద్‌లను అరెస్టు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న బోయిన విష్ణును తాజాగా కటకటాల వెనక్కి పంపారు. మరో నిందితుడు ఎండీ లాయక్ మృతి చెందాడు. సీఐ సీహెచ్ ఉమాకాంత్, ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బందిని సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అభినందించారని ఏసీపీ తెలిపారు.

గంజాయి కేసులో నిందితుల అరెస్టు

గోపాలపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో పరారైన ఇద్దరు నిందితులను గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ లెంక సన్యాసినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం అల్లంపుట్ గ్రామానికి చెందిన కొర్రా బాబూరావు, ముంచింగిపుట్టు మండలం జోలాపుట్‌కి చెందిన దోరా వెంకటరావు గంజాయి రవాణా కేసులో పరారీలో ఉన్నారు. గురువారం వారిని అల్లూరి జిల్లాలోనే అరెస్టుచేసి శుక్రవారం రిమాండుకు తరలించారు.

పెందుర్తిలో మరొకరు...

పెందుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) పరారీలో ఉన్న గంజాయి నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం దుంబ్రిగుడ గ్రామానికి చెందిన గెమ్మలి శ్రీను ఈ ఏడాది ఏప్రిల్‌లో గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడిని స్టేషన్‌కు తరలించే సమయంలో పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. ఈ క్రమంలో నిందితుడు పెందుర్తి రైల్వేస్టేషన్‌కు వస్తున్నాడన్న సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు నిఘా పెట్టి, అతడిని అదుపులోకి తీసుకుని, కోర్టుకు తరలించారు.

56 కేసుల్లో 64 మంది నిందితుల అరెస్టు

- రూ.1.1 కోట్ల రికవరీ: సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి



బాధితురాలికి చైను అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

మహారాణిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత రెండు, మూడు నెలలతో పోలిస్తే నగరంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. కమిషనరేట్‌లో శుక్రవారం సెప్టెంబరు నెల రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలైలో 105 కేసులు, ఆగస్టులో 100 నమోదు కాగా, సెప్టెంబరులో 56 కేసులు నమోదయ్యాయన్నారు. 56 కేసులలో 64 మంది నిందితులను పట్టుకుని, వారి నుంచి రూ.1,10,10,000 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇందులో దోపిడీ, ఏడు ఇళ్లలో దొంగతనాలు, 12 గొలుసు చోరీలు, 12 ద్విచక్రవాహనాల దొంగతనం, 24 సాధారణ దొంగతనాలపై కేసులు నమోదయ్యాయని వివరించారు. పోగొట్టుకున్న 436 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో 257 సీసీ కెమెరాలు అమర్చామన్నారు. మేళాలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింహాచలం ఈవోగా సుజాత బాధ్యతల స్వీకరణ



ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుజాత

సింహాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా దేవాదాయశాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత శుక్ర వారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఈఓగా పని చేసిన వేండ్ర త్రినాథరావు రాజమహేంద్రవరం మల్టీ జోన్-1 ప్రాంతీయ సంయుక్త కమిషనర్‌గా కొనసాగుతారు. దీంతో సుజాత సింహాద్రినాథుడ్ని దర్శించుకుని, అనంతరం పత్రాలపై సంతకాలు చేసి బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆశీర్వచనాలీయగా, ఏఈఓలు రమణమూర్తి, తిరుమలేశ్వరరావు, వీఆర్‌ఓ అప్పలనాయుడు అభినందనలు తెలిపారు.

ఏయూలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



సూపర్ ఓవర్ విజేత, రన్నరప్ జట్టు సభ్యులతో వీసీ, తదితరులు

విశాఖపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం విభాగం పూర్వ సంచాలకులు పీఆర్ నారాయణస్వామి, వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ప్రారంభించారు. క్రికెట్ టోర్నమెంట్ కొత్తగా నిర్వహించాలని ప్రతిపాదించిన ప్రొఫెసర్ విజయ్‌మోహన్‌ను వీసీ అభినందించారు. విజేతలకు రూ.5 లక్షల నగదు బహుమతులు అందిస్తామన్నారు. క్రీడా విభాగం సంచాలకులు విజయ్‌మోహన్ మాట్లాడుతూ ఈనెల 28 నుంచి జిమ్నాజియం, ఆంధ్ర మెడికల్ కళాశాల, విజయనగరం, అనకాపల్లిలో నాలుగు పూల్‌లుగా విభజించి పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ఏయూ పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ నన్నపనేని సత్యంబాబు నగదు బహుమతులను స్పాన్సర్ చేశారన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి.కింగ్, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, ఎ.నరసింహారావు, జి.గిరిజా శంకర్, ఎంవీఆర్ రాజు, కె.సీతామాణిక్యం, ఆర్.పద్మశ్రీ, క్రీడా విభాగాధిపతి ప్రొఫెసర్ ఎ.పల్లవి, టి. షారోన్‌రాజు, యుగంధర్, ఇమ్మా నియేల్ రాజు తదితరులు పాల్గొన్నారు. టోర్నీ ప్రారంభం సందర్భంగా నిర్వహించిన సూపర్ ఓవర్ మ్యాచ్‌లో గాయత్రీ విద్యా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు విజేతగా, వి.మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచాయి. విజేత జట్టుకు రూ.50 వేలు, రన్నరప్‌కు రూ.30 వేలు, మెమెంటో ప్రదానం చేశారు.

ఆర్కిటెక్చర్ రంగంలో అపార ఉద్యోగావకాశాలు

- ఏఐ ఎక్స్‌పో ప్రారంభోత్సవంలో ఎంపీ శ్రీభరత్



ఎక్స్‌పోలో స్టాళ్లను పరిశీలిస్తున్న ఎంపీ శ్రీభరత్

బీచ్ రోడ్డు, అక్టోబర్ 24, (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రభుత్వ ప్రాజెక్టుల రూపకల్పనకు నిపుణులైన ఆర్కిటెక్ట్‌కు అవకాశం కల్పిస్తే నగరాలన్నీ సింగపూర్‌లా మారుతాయని ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ పేర్కొన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ ఆధ్వర్యంలో నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటుచేసిన ఏఐ ఎక్స్‌పోను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ భవన నిర్మాణాల్లో ఆర్కిటెక్ట్స్‌ను భాగస్వామ్యం చేయాలన్నారు. నిర్మాణ, ఇంటీరియర్ డిజైన్ రంగాల్లో కొత్త ఉత్పత్తులు, సాంకేతికత, జోడించాలన్నారు. ఇంటీరియర్ డిజైన్ రంగానికి చెందిన ఉత్పత్తులను ఒక ఛత్రం కిందకు తీసుకువచ్చి ప్రదర్శనను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నగరం స్థిరాస్తి, ఇంటీరియర్ డిజైన్‌కు చిరునామాగా మారిందన్నారు. భవిష్యత్తులో విశాఖ నగరాన్ని ప్రపంచంలోనే ఉత్తమస్థానంలో నిలిపేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఆర్కిటెక్ట్స్‌కు ఇంజనీరింగ్‌తో సమానమై ఆదరణ ఉందని పలు విద్యాసంస్థలు ఈ కోర్సులను నిర్వహిస్తున్నాయన్నారు. గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం ఏటా ఈ రంగం 1.5 మిలియన్లకుపైగా ఉద్యోగావకాశాలు కల్పిస్తోందన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ విశాఖపట్నం చైర్మన్ రాజేష్ నాగుల మాట్లాడుతూ ఉప కేంద్రాలతో సమన్వయం చేసుకోవడం, వృత్తిపరమైన పద్ధతులపై అవగాహన కల్పించడంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఆర్కి టెక్ట్‌లు, ప్లానర్లు, విద్యావేత్తలు, ప్రభుత్వ ప్రైవేటు రంగాలతో సమన్వయం చేసుకుని, సమాజాభివృద్ధికి ఆలోచనల్లో మార్పులు తీసుకొస్తామన్నారు. సుమారు 300 మంది ఆర్కిటెక్చర్స్‌తో 33 స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎ.రామ్‌జీ, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో 27 మందికి కారుణ్య నియామకాలు



నియామకపత్రాలు పొందిన వారితో మేయర్ పీలా, అధికారులు

వెంకోజీపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పనిచేసి, జీవీఎంసీ అభివృద్ధికి కృషి చేయాలని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తూ మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాల్లోని 27 మందికి శుక్రవారం తన చాంబర్‌లో కారుణ్య నియామకపత్రాలను అందజేశారు. నియామకపత్రాలు పొందిన వారిలో మజ్దూర్లు ఏడుగురు, ఆఫీసు సబర్డినేటర్లు ఐదుగురు, పీహెచ్ వర్కర్స్‌కు ఆరుగురు, నలుగురు పీహెచ్ మేస్త్రీలు, ముగ్గురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఎలక్ట్రిక్ హెల్పర్స్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎ.అప్పలనాయుడు, పర్యవేక్షకులు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 19 వినతులు

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 19 వినతులు వచ్చాయని చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ నిర్వహించారు. వినతులపై నిర్ణీత సమయంలో స్పందించి, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

'మెరుగైన సేవలందించడమే ధ్యేయం'



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మనీష్ సిన్హా

సాగర్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు వేగవంతమైన, అంతరాయం లేని సేవలం దించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్ సభ్యుడు మనీష్ సిన్హా అన్నారు. బీచ్ రోడ్డు ర్యాడిసన్ బ్లూ రిసార్ట్స్‌లో జరిగిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్స్ రెవెన్యూ రివ్యూ సమావేశానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత సెంట్రల్ జోన్ పరిధిలోని ఆదాయ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖలో ప్రారంభం కానున్న గూగుల్ డేటా సెంటర్‌కు తమ సంస్థ ద్వారా అందించాల్సిన సేవలు, ఉపాధి కల్పన, తదితర అంశాలపై ఉద్యోగులు దృష్టిసారించాలన్నారు. భవిష్యత్తులో ఇంటర్నెట్ వినియోగం మరింతగా పెరగనుందని చెప్పారు. ఈ సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్



రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్

ఆరిలోవ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చినగదిలిలోని ఈవీఎం గోదాములను కలెక్టర్ ఎంఎన్ హరింధిరప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. రెవెన్యు సిబ్బంది, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స కోసం వచ్చి వైద్యురాలి బంగారం చోరీ

మహారాణిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చికిత్స కోసం వచ్చిన ఓ మహిళ వైద్యురాలి బంగారం కాజేసింది. టూటౌన్ క్రైమ్ పోలీసులు 24 గంటల్లో ఆమెను పట్టుకొని బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం కొబ్బరితోట ప్రాంతంలో రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ ఎన్.రాజేశ్వరి వద్దకు చికిత్స కోసం ఇద్దరు మహిళలు వచ్చారు. ఒక మహిళ అనారోగ్యంగా ఉండటంతో ఆమెను లోపలకు తీసుకువెళ్లిసెలైన్ బాటిల్ పెట్టి చికిత్స చేశారు. అనంతరం వైద్యురాలు స్పృహతప్పి పడిపోయారు. అది చూసిన ఆ ఇద్దరు మహిళలు ఆమెను స్పృహలోకి తెచ్చే ప్రయత్నం చేసినా వైద్యురాలు పూర్తిగా అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయారు. ఇదే అదనుగా భావించిన ఓ మహిళ వైద్యురాలి ఒంటిపై ఉన్న 120 గ్రాముల బంగారు వస్తువులతో ఉడాయించింది. ఇంతలో వైద్యురాలి కుటుంబసభ్యులు వచ్చి చికిత్స కోసం ఆమెను ఆస్పత్రికి తరలించారు. సాయంత్రానికి అపస్మారకస్థితి నుంచి తేరుకున్న వైద్యురాలు తన నగలు పోయినట్టు గ్రహించి టూటౌన్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి సీసీ టీవీ ఫుటేజ్‌ల ద్వారా మర్రిపాలేనికి చెందిన యానంగి సత్యవతిగా గుర్తించారు. ఆమెను అదుపులోకి తీసుకొని విచారించి కాజేసిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

రెండు లారీలు ఢీ: డ్రైవర్‌కు గాయాలు



నుజ్జునుజ్జైన లారీ ముందు భాగం

అగనంపూడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రెండు లారీలు ఢీకొనడంతో ఒక డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన అగనంపూడి డొంకాడ కాలనీ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. గాజువాక వైపు వస్తున్న లారీ డొంకాడ కాలనీ వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. లారీ ముందు భాగం నుజ్జయింది. పోలీసులు లారీని తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యారంగ సమస్యలను సత్వరం పరిష్కరించాలి

- ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్
- విశాఖకు చేరుకున్న బస్సు జాత



బహిరంగ సభలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న విరాజ్ దేవాంగ్

సిరిపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి, పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్ అన్నారు. ఇందులో భాగంగా ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు చేపట్టిన బస్సు జాత శుక్రవారం విశాఖ చేరుకుంది. ఈ సందర్భంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన బహిరంగ సభలో దేవాంగ్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో నిరుపేద విద్యార్థులకు చదువులు భారమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో 4,500 పాఠశాలలు మూతపడ్డాయని, వాటిని వెంటనే పునఃప్రారంభించాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుదోపిడీకి అడ్డుకట్ట వేయాలన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 77ను రద్దు చేయాలన్నారు. విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 3,480 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సంక్షేమ వసతిగృహాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు. ప్రతి మండలంలో జూనియర్ కాలేజీ, నియోజకవర్గంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలన్నారు. బస్సు జాతలో సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తెస్తామన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉల్లం నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో వలరాజు, నాసర్, కుల్లాయిస్వామి, మస్తాన్, శేఖర్, మౌనిక కిరణ్, అబిషేక్, గ్రేష్ ప్రకాష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.





